ప్రజాశక్తి

మంగళవారం 16 సెప్టెంబర్ 2025 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

అధిక వర్షంతో ముంపు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

భారీ వర్షాలు జిల్లాను ముంచెత్తుతున్నాయి. పొలాలు నీట మునిగి పైర్లు దెబ్బతింటున్నాయి. గుంటూరులో అతి భారీ వర్షాలకు పల్లపు ప్రాంతాలు, కాలనీలు ముంపునకు గురై నగర వాసులకు ఇబ్బందులు తెచ్చిపెడుతున్నాయి. సెప్టెంబరులో 15వ తేదీ నాటికి సగటున 79.7 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉంది. అయితే గుంటూరు సహా ఇతర మండలాల్లో అధిక వర్షాలు నమోదయ్యాయి. జూన్ ఒకటి నుంచి సెప్టెంబరు 15 వరకు 506.4 మిల్లీ మీటర్లకు వర్షపాతానికిగాను 10 మండలాల్లో అధిక వర్షపాతం నమోదైంది. గుంటూరులో సైడ్ కాల్వలు, డ్రెయిన్ల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండటం, డ్రెయిన్లపై ర్యాంపులు నిర్మాణంతో వర్షపునీరు



ఆదివారం నాటి వానతో గుంటూరు నగరం కొరిటపాడు 5వ లైనులో నిలిచిన నీరు

కాల్వల్లోకి పోకుండా రోడ్డుపై నుంచి ఎటుబడితే అటుపోయి ఇళ్లలోకి, దుకాణాల్లోకి చేరి ముంపు సమస్య ఏర్పడుతోంది.

అధిక వర్షాల వల్ల పొలాల్లోనూ నీరు నిలిచి ఆది బయటకు పోయే అవకాశం లేక పైర్లు నీట మునుగుతున్నాయి. గతనెల 13, 14 తేదీల్లో అతి భారీ వర్షాలకు ▶ 2లో

సురవరం సుధాకరరెడ్డి స్ఫూర్తిని కొనసాగించాలి

సంస్మరణ సభలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

- 2 లో

డిఎస్సీ ఎంపిక జాబితా విడుదల

19న నియామకపత్రాల అందజేతకు ఏర్పాట్లు

వెబ్‌సైట్, కలెక్టరేట్‌లోని డిస్‌ప్లే బోర్డులో వివరాలు

ప్రజాశక్తి-గుంటూరు

మెగా డిఎస్సీకి సంబంధించి ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులతో తుది ఎంపిక జాబితాను విద్యాశాఖ విడుదల చేసింది. జాబితాను ఎపి డిఎస్‌సి వెబ్‌సైట్‌లో, deognt.blogspot.com వెబ్‌సైట్‌లో, కలెక్టరేట్‌లోని డిస్‌ప్లే బోర్డులోనూ ఉంచారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 1143 పోస్టులు భర్తీ చేయనున్నారు. అయితే కొన్ని పోస్టులకు రిజర్వేషన్ కేటగిరీ అభ్యర్థులు లేకపోవటంతో సుమారు 19 పోస్టుల భర్తీ ప్రక్రియ నిలిచింది. వీటిని రానున్న డిఎస్సీలో కలిపి భర్తీ చేస్తారు. మేనేజ్‌మెంట్ల వారీగా ప్రభుత్వ/స్థానిక సంస్థలు, మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్, ఎపి మోడల్ స్కూల్స్, జువైనల్ వెల్ఫేర్, ఎపి రెసిడెన్షియల్, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సిల్ వంటి ఇతర మేనేజ్‌మెంట్లకు సంబంధించిన, సబ్జెక్టువారీగా ఎంపిక జాబితాలు విడుదలయ్యాయి. ఈనెల ▶ 2లో

చావుతో పోరాడి అలసిన పసిప్రాణం

కుక్కకాటుకు గురైన ఐదేళ్ల చిన్నారి మృతి

ప్రజాశక్తి - పొన్నూరు



ఇటీవల కుక్క కాటుకు గురైన మండలంలోని వెల్లలూరు గ్రామానికి చెందిన తాడిశెట్టి కార్తీక్ (5) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. గతనెల 22వ తేదీన ఇంటి వద్ద ఆడుకుంటున్న ▶ 2లో



నూతన పాలకవర్గంతో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

అర్బన్ బ్యాంక్ ఛైర్మన్‌గా ముంగమూరి

ప్రజాశక్తి - తెనాలి

ది తెనాలి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఛైర్మన్‌గా ముంగమూరి హరిప్రసాద్ ఎన్నికయ్యారు. పాలకవర్గ ఎన్నికలు సోమవారం ముగిసాయి. ఒకే ఒక్క ప్యానల్ నామినేషన్లు దాఖలు చేయడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి కుర్రా వెంకటేశ్వరరావు ప్రకటించారు. ఈ మేరకు నూతనంగా ఎన్నికైన పాలకవర్గానికి ఎన్నిక ధ్రువీకరణ పత్రాలను అందించారు. వైస్ ఛైర్మన్‌గా అక్కిశెట్టి వెంకటేశ్వరరావు, కోశాధికారిగా కోట పున్నారావు, డైరెక్టర్లుగా షేక్ జిలాని, కనగాల శ్రీనివాసరావు, తోట చంద్రశేఖర్, గడ్డిపాటి నాగయ్య, బచ్చు శ్రీనివాస్, కన్నెగంటి శ్రీనివాసరావు, కందెపు హరిప్రసాద్, దొప్పలపూడి శాంసన్, గండపనేని పూర్ణచంద్రరావు ఎన్నికయ్యారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ పాలకవర్గాన్ని అభినందించారు. ఆయన సమక్షంలో హరిప్రసాద్ ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో గౌరీశంకర్, వాసుదేవనాయుడు తదితరులు పాల్గొన్నారు.



వివి సుబ్బారావును సత్కరిస్తున్న ప్రిన్సిపాల్

దేశాభివృద్ధిలో సాంకేతికతదే కీలకపాత్ర

ప్రజాశక్తి-గుంటూరు

లాంలోని చలపతి ఇంజినీరింగ్ కాలేజిలో సోమవారం ఇంజినీర్స్ డే నిర్వహించారు. కార్యక్రమాన్ని ఎపి ఎస్ఈబి రిటైర్డ్ డిఈ వి.వి.సుబ్బారావు ప్రారంభించారు. సర్ మోక్షగుండం విశ్వేస్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువ ఇంజినీర్లు మోక్షగుండం విశ్వేస్వరయ్యను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. నీతి, నిజాయితీ కలిగిన యువ ఇంజినీర్లు దేశానికి అవసరమని చెప్పారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ యువ ఇంజినీర్లు నూతన పరికరాల తయారీపై దృష్టి సారించాలన్నారు. విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ డి.వినయ్‌కుమార్, డాక్టర్ ఎ.బాలాజీ, డాక్టర్ కెవి.రామారావు, తదితరులు పాల్గొన్నారు.

104 ఎంఎంయు ఎంప్లాయీస్ సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-గుంటూరు

104 మొబైల్ మెడికల్ యూనిట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ యూనియన్ నాయకులు సోమవారం గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్‌కు వినతిపత్రం అందచేశారు. భవ్య హెల్త్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం నుండి ఉద్యోగులకు తగ్గించిన వేతనాలతో సహా చెల్లించాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, గత యాజమాన్యం అరబిందో నుంచి రావాల్సిన బకాయిలను చెల్లించాలన్నారు. 104లో స్లాబ్ పద్ధతి అమలు జరపాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులకు అమలయ్యే లీవులు, ఎర్న్‌లీవులు, పబ్లిక్ హాలిడేలు, గుర్తింపు కార్డులు, పేస్లిప్పు ఇవ్వాలని కోరారు. వాహనాలకు సరిపడిన సిబ్బందిని నియమించాలని, అవసరమైన చోట బఫర్‌జోన్ ఉద్యోగులను నియమించాలని, పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఆయా అంశాలపై రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించి పరిష్కారించాలని కృషి చేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో గౌరవాధ్యక్షులు బి లక్ష్మణరావు, అధ్యక్షులు గోరంట్ల సురేష్ కుమార్, కోశాధికారి ఐ.నాగులు, మంచాలు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

డిఎస్సీ ఎంపిక జాబితా విడుదల

(మొదటి పేజీ తరువాయి)

19న అమరావతిలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమంలో ఎంపికైన వారికి నియామకపత్రాలు ఇవ్వనున్నారు. ఏ పోస్టుకు ఎంపికయ్యారో తెలియజేస్తూ మాత్రమే నియామకపత్రాలిస్తారు. ఎక్కడ పోస్టింగ్ అనే వివరాలు అందులో ఉండదు. నియామక పత్రాల జారీ తర్వాత జిల్లాల వారీగా శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తారు. దసరా సెలవుల అనంతరం శిక్షణ పూర్తి చేసి, కొత్త ఉపాధ్యాయుల్ని పాఠశాలలకు పంపించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. శిక్షణలోనే కౌన్సెలింగ్ నిర్వహించి, పాఠశాలల కేటాయిస్తారని సమాచారం. అయితే పాఠశాలల ఎంపికకు వెబ్ కౌన్సెలింగ్ నిర్వహిస్తారా? మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహిస్తారా? అనేది స్పష్టత రాలేదు.

అధిక వర్షంతో ముంపు

(మొదటి పేజీ తరువాయి)

కొల్లిపర, దుగ్గిరాల, పెదకాకాని, చేబ్రోలు మండలాల్లో దాదాపు 70 వేల ఎకరాల్లో వరి పైరు నీట మునిగి రైతులు రూ.10-15 వేల పెట్టుబడి నష్టపోయినా ప్రభుత్వం నుండి సాయమేమీ అందలేదు. పైర్లు ప్రాథమిక స్థాయిలో ఉంటే పరిహారం రాదని అధికారులు స్పష్టం చేశారు. తాజా వానలతోనూ పెదకాకాని, దుగ్గిరాల, కాకుమాను తదితర మండలాల్లో పైర్లు నీట మునిగాయి. ఆగస్టు, సెప్టెంబరులో కొల్లిపర, చేబ్రోలు, పెదకాకాని, దుగ్గిరాల మండలాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాల వల్ల పైర్లకు ముంపు సమస్య వెంటాడుతోంది. గుంటూరు నగరంలో పల్లపు ప్రాంతాలు అధికంగా ఉండటం, కొత్తగా ఏర్పడిన కాలనీల్లో డ్రెయినేజి వ్యవస్థ లేకపోవడం, మెరక ప్రాంతాల్లోనూ డ్రెయినేజీ వ్యవస్థ అస్తవస్తంగా మారడం వల్ల చిన్నపాటి వానకే ముంపు సమస్య వస్తోంది. గుంటూరు పశ్చిమ మండలంలో శనివారం 74.2 మిల్లీ మీటర్లు, ఆదివారం 125.2 మిల్లీ మీటర్లు చొప్పున వర్షం నమోదై అనేక ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. గుంటూరు పశ్చిమ మండలంలో ఈనెల ఒకటో తేదీ నుంచి 15 వరకు 74.4 మిల్లీ మీటర్ల వర్షం కురవాల్సి ఉండగా ఆదివారం వరకు 348.4 మిల్లీ మీటర్లు, ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు 125.2 మిల్లీ మీటర్లు నమోదైంది. గుంటూరు తూర్పు 88.2, పెదకాకాని 54.2, కాకుమాను 54.0, దుగ్గిరాల 45.6, మంగళగిరి 43.0, కొల్లిపర 38.4, తాడికొండ 26.6, పెదనందిపాడు 26.4, తాగేపల్లి 17.6 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది.

సెప్టెంబరు నెలలో 15 తేదీ వరకు కురవాల్సిన వర్షం, కురిసిన వర్షం వివరాలు ఇలా ఉన్నాయి.

మండలం	కురవాల్సిన వర్షం	కురిసిన వర్షం (మిల్లీ మీటర్లలో)
గుంటూరు పశ్చిమ	130.4	348.4
గుంటూరు తూర్పు	130.4	322.2
పెదకాకాని	136.6	291.0
దుగ్గిరాల	149.6	233.0
కొల్లిపర	139.0	188.8

చావుతో పోరాడి అలసిన పసిప్రాణం

(మొదటి పేజీ తరువాయి)

కార్తీక్‌పై వీధి కుక్కలు దాడి చేశాయి. కుక్కలు ఒళ్లంతా కరవడంతో తీవ్రంగా గాయాల పాలైన కార్తీక్‌ను తండ్రి రాజా హుటాహుటిన నిడుబ్రోలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)కు తరలించారు. కొద్దిరోజుల చికిత్స అనంతరం చిన్నారిని విజయవాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయినా ఫలితం లేకపోవడంతో రేబిస్ బారిన పడిన చిన్నారి కార్తీక్ సోమవారం మృత్యువాత పడ్డాడు. వ్యవసాయ పనులు చేసుకునే తాము నానా తిప్పలు పడి, అప్పులు చేసి, రూ.10 లక్షల వరకూ వైద్యం కోసం ఖర్చు చేసినా తమబిడ్డను దక్కించుకోలేకపోయామని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతునికి తల్లిదండ్రులతోపాటు మూడేళ్ల సోదరి ఉంది.

సురవరం సుధాకరరెడ్డి స్ఫూర్తిని కొనసాగించాలి

సంస్మరణ సభలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

ప్రజాశక్తి-గుంటూరు, పల్నాడు జిల్లా

సిపిఐ జాతీయ కార్యదర్శిగా, ఎంపీగా ప్రజాసమస్యల పరిష్కారం కోసం కృషి చేసిన సురవరం సుధాకరరెడ్డి స్ఫూర్తితో పనిచేస్తే ప్రజాస్వామ్యం వికసిస్తుందని నర్సరావుపేట ఎంపి లావు శ్రీకష్ణదేవరాయలు అన్నారు. గుంటూరు, నరసరావుపేటలో సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభలు నిర్వహించారు. జనచైతన్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి గుంటూరు, కొత్తపేటలోని వేములపల్లి శ్రీకృష్ణ హాలులో నిర్వహించిన సభకు జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వి.లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించగా శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ 65 ఏళ్ల రాజకీయ జీవితంలో నిరంతరం ప్రజా సమస్యలపై అధ్యయనం చేస్తూ వాటి పరిష్కారానికి సుధాకర్‌రెడ్డి కృషి చేశారన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ సురవరం సుధాకరరెడ్డి నిరంతర అధ్యయన శీలి అని, పదవిలో ఉన్నా లేకున్నా నిరాడంబర జీవితాన్ని గడిపారని అన్నారు. 18 ఏళ్లకి ఓటు హక్కు కావాలనే ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించారని చెప్పారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ భారతదేశ రాజకీయాలను ఉన్నత స్థితికి తీసుకువెళ్లే ప్రయత్నం చేసిన మహనీయులు సురవరం సుధాకరరెడ్డి అని కొనియాడారు. తెలుగుజాతి గౌరవాన్ని ఇనుమడింప చేశారన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బహుభాషా కోవిదుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన సుధాకర్‌రెడ్డి సాహిత్యం నుండి సైన్స్ వరకు నిరంతరం అధ్యయనం చేసేవారని తెలిపారు. లౌకిక, ప్రజాతంత్ర శక్తులను ఐక్యం చేయడం ద్వారా మతోన్మాద రాజకీయాల నుండి దేశాన్ని కాపాడుకోవాలని కృషి చేసేవారన్నారు. లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ రాజకీయ అవినితి అరికట్టేందుకు పోరాడటమే ఆయనకు అర్పించే నివాళి అన్నారు. కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.వినయ్ కుమార్ మాట్లాడుతూ దళిత, గిరిజన, వెనుకబడిన వర్గాల కోసం దూర దృష్టితో పనిచేశాడన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జె.అజయ్ కుమార్, సిపిఐ, సిపిఎం జిల్లా కార్యదర్శులు కె.మాల్యాద్రి, వై.నేతాజి పాల్గొన్నారు.



గుంటూరు సభలో మాట్లాడుతున్న ఎంపి శ్రీకృష్ణదేవరాయలు

పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని వెంకటేశ్వర కళ్యాణ మండపంలో నిర్వహించిన సంస్మరణ సభలో సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.నాగేశ్వరరావు మాట్లాడుతూ సుధాకర్‌రెడ్డి ఆలోచనలు కొత్త తరాలకు మార్గదర్శకమన్నారు. అనేక దేశాలు పర్యటించి విప్లవ సిద్ధాంతాలను శోధించారని, అంతర్జాతీయ రాజకీయ పరిస్థితులను, సవాళ్లను, పర్యవసనాలను 20 ఏళ్ల ముందే పసిగట్టి పార్టీ శ్రేణులను సమరశీల పోరాటాల వైపు నడిపారని చెప్పారు. సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థి యువజన ఉద్యమాలకు సురవరం దిక్సూచిగా నిలిచారన్నారు. అన్ని పార్టీల వారు అభిమానించే ఆయన వామపక్షాల ఐక్యత కోసం పాటుపడ్డారని చెప్పారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ తన కుటుంబ నేపథ్యం కమ్యూనిస్టులతో ముడిపడి ఉందని, భవిష్యత్తులో కలసి పనిచేయాల్సి వస్తే వారికి తాను తోడుగా ఉంటానని చెప్పారు. సభలో సిపిఐ పల్నాడు జిల్లా కార్యదర్శి ఎ.మారుతి వరప్రసాద్, నాయకులు వై.చంచయ్య, టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.శ్రీధర్, రాష్ట్ర గ్రంధాలయ సంస్థ చైర్మన్ జి.కోటేశ్వరరావు, సిపిఐ శ్రేణులు పాల్గొన్నారు.



నరసరావుపేట సభలో నివాళులర్పిస్తున్న నాయకులు

తురకపాలెం ఘటనలను పునరావృతం కానియ్యొద్దు

అధికారులకు సిఎం చంద్రబాబు హెచ్చరిక

కలెక్టర్ల సదస్సుకు హాజరైనతమీమ్ అన్సారీ,కృతికా శుక్లా

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

తురకపాలెం లాంటి ఘటనలు ఎక్కడా పునరావృతం కాకుండా ప్రజారోగ్యంపై అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ల సదస్సు వెలగపూడి సచివాలయంలో జరిగింది. గుంటూరు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారీ, పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా ఈ సమావేశానికి హాజరు అయ్యారు. వివిధ శాఖలపై జరిగిన చర్చల్లో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు మాట్లాడుతూ వైద్య, ఆరోగ్య శాఖ అధికారుల పనితీరు మెరుగుపడాలన్నారు. గ్రామస్థాయిలో వైద్య సేవలపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామస్థాయిలో వ్యాపించే బ్యాక్టీరియా, వైరస్‌లను ఎప్పటికప్పుడు జిల్లా అధికారులు పరిశీలన చేసి ఇతర ప్రాంతాలకు వ్యాప్తి చెందకుండా క్షేత్రస్థాయిలోనే నియంత్రించేలా పారిశుధ్యం, తాగునీటి సరఫరాల్లో లోపాలు లేకుండా చూడాలన్నారు. డ్వాక్రా మహిళల పెట్టుబడి రూ.10 లక్షల కోట్ల టర్నోవర ఉండేలా లక్ష్యంగా పెట్టుకున్నట్టు వివరించారు. పి-4 ద్వారా బంగారు కుటుంబాలను ఆదుకునేందుకు మార్గదర్శకుల ఎంపిక స్వచ్ఛందంగానే జరగాలన్నారు. యూరియా వినియోగం తగ్గించేందుకు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. యూరియా ఎక్కువగా వాడితే కేన్సర్ వస్తుందన్నారు. జిల్లా నుంచి మంత్రులు నారా లోకేష్, నాదెండ్ల మనోహర్ కలెక్టర్ల సదస్సులో పాల్గొన్నారు.



సమావేశంలో గుంటూరు, పల్నాడు జిల్లా కలెక్టర్లు

సిఎంను కలిసిన ఎస్‌పి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు ఎస్‌పి వకుల్ జిందాల్ సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడ్ని మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్ల సమావేశంలో పాల్గొనేందుకు సచివాలయంకు వచ్చిన చంద్రబాబుకు ఎస్‌పి వకుల్ జిందాల్ బొకే ఇచ్చి స్వాగతం పలికారు. ఎస్‌పిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత ఆయన తొలిసారిగా సిఎంను కలిశారు.

రాజధాని రైతులకు రిటర్నబుల్ ప్లాట్లు ఇవ్వాలి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాజధాని అమరావతికి భూ సమీకరణలో భూములు ఇచ్చిన రైతులకు ఇంత వరకు రిటర్నబుల్ ప్లాట్లు ఇవ్వకుండా మరో విడత భూ సమీకరణకు వెళ్లాలన్న ప్రభుత్వ ఆలోచన సరికాదని వైసిపి తాడికొండ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు (డైమండ్‌బాబు) తెలిపారు. గుంటూరులోని వైసిపి జిల్లా కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాజధాని స్వయం సమృద్ధి ప్రాజెక్టు అని 10 వేల ఎకరాల భూములు అందుబాటులో ఉన్నాయని వీటిని అమ్మి రాజధాని నిర్మించవచ్చునని ప్రతిపక్షంలో ఉండగా అప్పటి సిఎం జగన్‌కు సలహాలు ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇప్పుడు రూ.94 వేల కోట్లతో అప్పులు తెచ్చి నిర్మాణాలు చేస్తున్నారని గుర్తు చేశారు. 10 వేల ఎకరాల భూమి అందుబాటులో ఉందని చెప్పిన చంద్రబాబు ఇప్పుడు మాట మార్చి ప్రభుత్వానికి రాజధానిలో భూములు లేవు అందువల్ల రెండో విడత సమీకరణకు వెళ్తున్నామని చెబుతున్నారన్నారు. రాజధానిపై మంత్రి నారాయణ, ప్రజా ప్రతినిధులు ఎప్పటికప్పుడు మాటలు మారుస్తున్నారని తెలిపారు. సిఆర్‌డిఏ చట్టంలో పేర్కొన్న విధంగా రైతులకు రిటర్నబుల్ ప్లాట్లు అప్పగించాలన్నారు.

గుంటూరులో కిడ్నాప్.. ఆపై హత్య

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



హత్యకు గురైన రామాంజనేయులు (ఫైల్ ఫొటో)

గుంటూరు నగరంపాలెం పోలీసు స్టేషన్ పరిధిలో యువకుడ్ని కిడ్నాప్ చేసి అనంతరం బాపట్ల జిల్లా అద్దంకిలో హత్య చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివాహేతర సంబంధం నేపథ్యంలో ఈ ఘటన జరిగినట్టు తెలిసింది. స్థానిక సీతమ్మ కాలనీకి చెందిన వేముల రామాంజ నేయులు (38) గత శనివారం నుంచి కన్పించడం లేదని ఆయన భార్య వేముల శివ పార్వతి పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో ఉన్న వివాదాల నేపథ్యంలో అదే కాలనీకి చెందిన బండారు కొం డయ్యపై అనుమానం వ్యక్తం చేశారు. పోలీసులు కొండయ్యను అదుపు లోకి తీసుకుని విచారించారు. రామాంజనేయు లును కొండయ్యతో పాటు అతని బంధువులు, మరో ముగ్గురు కలసి హత్య చేసినట్టు విచారణలో అంగీకరించారు. అద్దంకి శివారు ప్రాంతంలో రామాంజనేయులను మృత దేహాన్ని పడేసినట్టు వెల్లడించారు. దీంతో మృతదేహం కోసం పోలీసులు గాలిస్తున్నారు. సోమవారం మృతదేహం లభ్యమై నట్టు తెలిసింది. నగరంపాలెం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అధికారులకు సచివాలయ ఉద్యోగుల వినతి

ప్రజాశక్తి - చేబ్రోలు

సోమవారం చేబ్రోలు సచివాలయ ఉద్యోగులు ఆందోళన కార్యక్రమాల ముందస్తు సమాచారాన్ని అధికారులకు రాతపూర్వకంగా యూనియన్ రిప్రెజెంటేషన్ ద్వారా తెలిపారు. ఏపీ గ్రామ , వార్డు సచివాలయ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర వ్యాప్త నిర్ణయం మేరకు రాష్ట్ర వ్యాప్తంగా సమస్యల పరిష్కారం కోరుతూ ఎంపిడిఓ, తహశీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 1.25 లక్షల మంది గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు సెప్టెంబర్ 9వ తేదీ నుంచి 15 రోజులలోగా పరిష్కారం చూపాలని కోరు తున్నామన్నారు. సమస్యలకు పరిష్కారం లభించని పక్షంలో ఏపీ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక తరపున ఉద్యోగుల నియమ నిబంధనలకు కట్టుబడి రాష్ట్రవ్యాప్త నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

పరిశ్రమల ఏర్పాటుపై అవగాహన

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక హుడా కాలనీలోని ఎన్టీఆర్ కమ్యూనిటీ హాల్లో సోమవారం చిన్న మధ్య తరహా పరిశ్రమల స్థాపనపై అవగాహన కల్పించారు. జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో నిర్వ హించిన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పి.శ్రీకాంత్, ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్ నాగేంద్ర పాల్గొ న్నారు. ఆసక్తిగల పారిశ్రామికవేత్తల వివరాలు నమోదు చేశారు. వారు మాట్లా డుతూ ప్రభుత్వం చేపట్టిన 'ర్యాంపు' కార్యక్రమంలో భాగంగా చిన్న, మధ్య తరగతి పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను వివరించారు. కార్యక్రమంలో సిటీ మిషన్ మేనేజర్ విజయకుమార్ పాల్గొన్నారు.



దీపం వెలిగిస్తున్న కళాశాల ఛైర్మన్, ప్రిన్సిపాల్

ఘనంగా ఇంజినీర్స్ డే

ప్రజాశక్తి - చేబ్రోలు

స్థానిక ఆర్‌విఐటిలో ఇంజినీరింగ్ దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమం ఛైర్మన్ వంశీ కృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వి.కృష్ణయ్య దీపం వెలిగించడంతో ప్రారంభమైంది. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. మల్లికార్జునయ్య, వివిధ విభాగాల హెచ్‌వో డీలు, అధ్యాపక వర్గం విద్యార్థులు పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులకు లిటరసీ క్విజ్ గూగ్లింగ్ పోటీ, టెక్నికల్ క్విజ్ , వెబ్ అప్లికేషన్ డెవలప్‌మెంట్, కోడింగ్ చాలెంజ , ప్రెజెంట్‌యాన్ ఐడియా మరియు పేపర్ ప్రెజెంటేషన్స్ అన్ని పోటీలలో విజేతలకు నగదు బహుమతులు ఛైర్మన్ అంద జేశారు. కార్యక్రమం భారత ఇంజనీరింగ్ రంగంలో భవిష్యత్ ఇంజనీర్లను ప్రేరేపించే దిశగా విజయవంతంగా నిర్వహించబడింది.



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసిన కళాశాల యాజమాన్యం

ప్రజాశక్తి - మేడికొండూరు

మండలంలోని విశదల అడ్డరోడ్డు వద్ద ఉన్న ఎన్నారై ఐటి ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా ఇంజనీరింగ్ దినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి తిలక్ బాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డి సంజయ్ మాట్లాడుతూ దేశాభివద్ధికి ఇంజనీర్లు చేసిన కృషి వారి సేవలను గుర్తించడమే ఈరోజు ముఖ్య ఉద్దేశమని అన్నారు. కళాశాల ఎకడమీక్ డీన్ కోట శ్రీనివాస్ మాట్లాడుతూ మైసూర్ కృష్ణరాజసాగర్ డ్యాం నిర్మాణంలో విశ్వేశ్వరయ్య కీలక పాత్ర పోషించారని తెలిపారు. విద్యార్థులు రక్తదానం ద్వారా ఇంజనీర్స్ డే గుర్తుగా ప్రాణదానం సమానంగా ఉండే 70 యూనిట్ల రక్తాన్ని శ్రీ బ్లడ్ బ్యాంక్ వారికి అందజేశారు. కార్యక్రమంలో వివిధ శాఖ అధిపతులు కన్వీనర్ గా భవాని, వైస్ ప్రిన్సిపాల్ శ్రీహరి , రెహమాన్, చంద్రమౌళి రాము, నాగేశ్వరావు, సౌజన్య శ్రీదేవి, బోధన, బోధ నేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి స్మార్ట్‌రేషన్ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి - రెంటచింతల

మండలంలోని 11 గ్రామాల్లో నేటి నుంచి స్మార్ట్ కార్డులను పంపిణీ చేయనున్నట్లు తహశీల్దార్ మేరీ కనకం తెలిపారు. 37 మంది రేషన్ డీలర్ల పరిధిలో వీఆర్వోసచివా లయ సిబ్బంది సమక్షంలో 15,400 కార్డులను పంపిణీ చేస్తారు తెల్ల కార్డు కలిగిన వారందరూ అందుబాటులో ఉండాలని ఆమె కోరారు.

ఇండస్ట్రియల్ విజిట్‌కు విద్యార్థులు

ప్రజాశక్తి - చేబ్రోలు

ఇండస్ట్రియల్ విజిట్‌కి జడ్పీహెచ్‌ఎస్ నారకోడూరు ఎలక్ట్రానిక్స్, ఐటీ అండ్ ఐటిఈఎస్, ఆటోమోటివ్ విద్యార్థులు వెళ్లారు. వృత్తి విద్యా శిక్షణ కార్యక్రమంలో భాగంగా 200 మంది చేబ్రోలులోని నూకల కోటేశ్వరరావు టెక్స్టైల్స్‌ని సంద ర్శించారు. యంత్రాల పనితీరు అనేకమైన ఎలక్ట్రానిక్ మిష నరీలు వాటి పనితీరు పరిశీలించారు. స్పిన్నింగ్ మిల్ యాజ మాన్యం వారు వివిధ రకాల యంత్రాల పనితీరును గురించి విద్యార్థులకు వివరించారు. పాఠశాల ఇన్చార్జి హెచ్ఎం ఎం.వెంకటేశ్వర రావు, రాజి రెడ్డి, పిడి టీచర్ ఉమామహేశ్వరి, ఒకేషనల్ ట్రైనర్స్ జి.దయమణి , ఆర్‌సురేంద్ర, కే.సుకుమార్, నూకల కోటేశ్వరరావు టెక్స్టైల్స్ యాజమాన్యం పాల్గొన్నారు.



రైతులకు బోనస్ అందజేస్తున్న మేనేజర్ ఆనందరావు

పాడి రైతులకు బోనస్ పంపిణీ

ప్రజాశక్తి - పెదకాకాని

మండల పరిధిలోని వెనిగండ్ల సొసైటీలో సోమవారం 2024-25 సంవత్సరానికి సంబంధించి 213 మంది పాల ఉత్పత్తిదారులకు రూ14,36,645 బోనస్ పంపిణీ చేశారు. మేనేజర్ టి.ఆనందరావు మాట్లాడుతూ సంఘం డైరీ అందించే పథకాలు, ప్రోత్సాహకాలను ఉపయోగించుకోవాలన్నారు. సంఘం అధ్యక్షులు పులగం వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడారు. అనంతరం అత్యధిక బోనస్ తీసుకున్న వారిలో కోడూరు లక్ష్మి రూ.2,92,116, కొండమడుగుల రామ్మోహన్‌రెడ్డి రూ.1,36, 781 ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో సంఘం పాలక వర్గం సభ్యులు వేతన కార్యదర్శి కే..సుబ్బారెడ్డి, సూపర్‌వైజర్ సిహెచ్. శివకృష్ణ, పాల ఉత్పత్తి దారులు పాల్గొన్నారు.

వైసిపి పంచాయతీరాజ్ రాష్ట్ర జనరల్ సెక్రటరీగా ఆరేపల్లి జోజి

ప్రజాశక్తి - తుళ్లూరు



బాల వజ్రబాబును కలిసిన ఆరేపల్లి జోజి

వైసిపి రాష్ట్ర పంచాయతీరాజ్ జనరల్ సెక్ర టరీగా రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరు మండలం అనంతవరానికి చెందిన ఆరేపల్లి జోజి సోమవారం నియమితులయ్యారు. వైసిపి నాయకులు, కార్యకర్తలతో కలిసి జోజి నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు (డైమండ్ బాబు) ను కలిసి పుష్ప గుచ్చం అందజేసి కృతజ్ఞత తెలిపారు. వైసిపి బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని జోజి చెప్పారు. జోజిని అభినందించిన వారిలో వైసిపి నాయకులు మైనేని నాగమల్లేశ్వర రావు, చుండు వెంకటరెడ్డి,ఆలూరి శ్రీనివాసరావు, బెజ్జం రాంబాబు,కొప్పుల శేష గిరిరావురావు, కొయ్యగూర వినోద్, మేకల రవీంద్ర, కొప్పుల ఆంద్రేప్ప, బేతపూడి రాజేంద్ర, దానంవినోద్, నాగేశ్వరరావు ఉన్నారు.

శ్రీకాకుళం వ్యక్తి తాడేపల్లిలో ఆత్మహత్య

ప్రజాశక్తి- తాడేపల్లి



తాడేపల్లి పట్టణంలోని బైపాస్ రోడ్డు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సమీపంలో ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పక్కన ఈ ఘటన జరగటంతో స్థానికంగా కలకలం రేగింది. మృతుడు శ్రీకాకుళంకు చెందిన బైరి వెంకన్న (45) గా తాడేపల్లి పోలీసులు గుర్తించారు. విజయవాడలో పండ్లు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నట్టు తొలి విషయాలు తేలింది. మద్యానికి బానిసై, అప్పుల బాధ తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడ్డట్టు తెలిసింది. తాడేపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ వినియోగంపై విజిలెన్స్ తనిఖీలు

ప్రజాశక్తి- తెనాలి



వివరాలు వెల్లడిస్తున్న విద్యుత్ అధికారులు

పట్టణ ప్రాంతంలో విద్యుత్ విజిలెన్స్ అధికారులు, ఆపరేషన్ సిబ్బందితో కలిసి సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. డిపిఇ(విజిలెన్స్) ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సిహెచ్ వెంకటేశ్వరరావు, ఆపరేషన్స్ ఇఇ వివి చిరంజీవి నేతత్వంలో ఆపరేషన్స్ బృందంతో కలిసి డి 2 సెక్షన్ పరిధిలో పెదరావూరు, జగ్గడి గుంట పాలెం, మల్లెపాడు, సుల్తానాబాద్, కె జోన్, ఎల్ జోన్ ఎం.జోన్‌లో విస్తృత తనిఖీలు చేపట్టారు. తనిఖీలలో మొత్తం 58 మంది అధికారులు, 128 మంది సిబ్బంది 58 బృందాలుగా తనిఖీలు నిర్వహించారు. వారు మాట్లా డుతూ విద్యుత్ వినియోగంలో నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. దాడుల్లో డిపిఇ (విజిలెన్స్) డిఇఇలు కె రవికుమార్, ఎన్ మల్లికార్జున ప్రసాద్, ఎస్ శ్రీనివాసరావు, ఆపరేషన్ డి ఈ బి అశోక్ కుమార్, ఎఇ ఎన్ వెంకట్రావు, డిపిఇ(విజిలెన్స్) ఎంఇఓ కె కోటేశ్వరరావు ఎం సతీష్ కుమార్ యు శివశంకర్ పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో గ్రీవెన్స్‌కు 151 అర్జీలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్‌ఎస్)లో అందిన అర్జీల సత్వర పరిష్కారమే లక్ష్యంగా పని చేయాలని అధికారులను పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే ఆదేశించారు. నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో ప్రజల నుండి 151 అర్జీలను జెసితోపాటు ఇతర అధికారులు స్వీకరించారు. వీటిని శాఖల వారీగా నిర్దిష్ట సమయంలోగా పరిష్కరించాలని, రీ-ఓపెన్ కాకుండా చూసుకోవాలని జెసి చెప్పారు.

బాణసంచాల వినియోగాన్ని నిషేధించండి

ప్రమాదాలు, పర్యావరణ కాలుష్యానికి కారణమవుతున్న టపాసులు, పేలుడు పదార్థాలను వివిధ పండుగలు, ఉత్సవాల సందర్భాల్లో వినియోగిస్తున్న నేపథ్యంలో వాటిపై నిషేధం విధించాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక నాయకులు వినతిపత్రం ఇచ్చారు. వేదిక అమరావతి ప్రాంత కన్వీనర్ డి.ఏడుకొండలు మాట్లాడుతూ బాలలు ప్రమాదాలకు గురికాకుండా కఠిన ఆంక్షలు విధించాలన్నారు. గతనెల 29న నెల్లూరు జిల్లా అప్పసముద్రం గ్రామంలో గణేష్ నిమజ్జన సందర్భంగా టపాసులు కాల్చడం వల్ల 9 మంది బాలబాలికల శరీరం కాలి, తీవ్ర గాయాలపాలయ్యారని, ఇందుకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. క్షతగాత్రులకు ఉచిత చికిత్సతో పాటు రూ.10 లక్షల ఆర్థిక సాయం అందించాలన్నారు. ఉత్సవాల్లో బాలలతో టపాసులు కల్పించడం, డిసి కరెంటు లైటింగ్ కర్రలు పట్టుకోవడం తదితర ప్రమాదకర పనులు చేయించకుండా కఠిన నిబంధనలు విధించాలని, డీజేలతో ధ్వని కాలుష్యం సృష్టించకుండా చూడాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రముఖ గాంధేయవాది ఈదర గోపీచంద్, యాదవ మహాసభ అధ్యక్షులు ఎస్.గాంధీ, కె.మహమ్మద్ నూర్ పాల్గొన్నారు.

ఎస్‌కెబిఆర్ కాలేజీలో 20న జాబ్‌మేళా

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

డిపార్ట్మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్మెంట్ అండ్ ట్రెనింగ్ అధ్వర్యంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, మాచర్ల ఎస్‌కెబిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్వర్యంలో పట్టణంలోని డిగ్రీ కాలేజీలో శనివారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఇ.తమ్మాజిరావు, కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ జె.లక్ష్మీకుమారి సోమవారం తెలిపారు. మాస్టర్ మైండ్స్, ఆదిత్య ఆర్గానిక్ ఎకో టెక్నాలజీ, కపిస్టన్ సర్వీసెస్, గోదావరి ఆంధ్ర కో-ఆపరేటివ్ త్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ, ఎంఆర్ఎఫ్ టైర్స్, ఇన్నోవ సోర్స్, టివిఎస్ బ్యాటరీ, టాటా ఎలక్ట్రానిక్స్, ఎయిర్టెల్ పేమెంట్ బ్యాంక్, స్కిల్ క్రాఫ్ట్ తదితర కంపెనీలు ఎంపికలు చేపడతాయని, ఎంపికైన వారికి విద్యార్హత ఆధారంగా రూ.15 వేల నుండి రూ.35 వేల వరకు జీతం ఉంటుందని పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్, ఐటిఐ, డిగ్రీ, బీటెక్, డిప్లొమా, ఫార్మసీ, పిజీజీ వరకు చదివిన 18-35 ఏళ్లలోపువారు తమ బయోడేటా లేదా రెస్యూమ్‌తో ఎడ్యుకేషన్ సర్టిఫికెట్ల ఫొటోస్టాట్ కాపీలు, ఆధార్ నకలు, పాస్ పోర్ట్‌ఫొటోలు తీసుకుని నేరుగా జాబ్‌మేళాకు హాజరవ్వాలని సూచించారు. మరింత సమాచారం కోసం ఆర్.కిరణ్ నాయక్ : 7842747682, శ్రీకాంత్:9492158153 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని సూచించారు. ఔత్సాహిక యువతి యువకులు ముందుగా https://naipunyam.ap.gov.in/user-registration అనే వెబ్ సైట్ నందు రిజిస్టర్ చేసుకోవాలని, రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోనివారు జాబ్‌మేళా వద్ద నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

కరాటే పతక విజేతలు, గురువులకు సత్కారం





ప్రజాశక్తి - సత్తెనపల్లి

సౌత్ ఇండియా కరాటే పోటీల్లో పట్టణానికి చెందిన పలువురు బంగారు, కాంస్య పతకాలు సాధించగా వారి అభినందన సభ స్థానిక పుచ్చపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం రాత్రి నిర్వహించి విజేతలను సన్మానించారు. సభకు ప్రముఖ న్యాయవాది పిన్నమనేని పాములయ్య అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఎం రాష్ట్ర కమిటీ మాజీ సభ్యులు గద్దె చలమయ్య మాట్లాడుతూ గతనెల 30, 31 తేదీల్లో బెంగళూరులో జరిగిన 4వ సౌత్ ఇండియా కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో సబ్ జూనియర్స్ కటా విభాగంలో సత్తెనపల్లికి చెందిన లగుమవరపు కిరీటి, లగుమవరపు గేశ్నుఆశిత్, మల్లాల వెంకట బాలాజీ, బొల్లేపల్లి టిషన్త్, బూతుకూరి అక్షయరెడ్డి బంగారు పతకాలు సాధించారని, బిట్రా సత్యనారాయణ కాంస్య పతకం సాధించారని వివరించారు. వీరికి శిక్షణిచ్చి విజేతలుగా నిలిపిన బ్లాక్ బెల్ట్ ఫిఫ్త్ డాన్ అనుముల రామయ్యనూ సత్కరించారు. ఈ సందర్భంగా పాములయ్య రాసిన సన్మాన పత్రాన్ని రామయ్యకు సమర్పించారు. రామయ్య గురువైన ఆయన సోదరుడు, సీనియర్ కరాటే మాస్టర్ అనుముల రాంబాబును సత్కరించారు. ఇంటర్నేషనల్ పవర్ లిఫ్ట్ గోల్డ్ మెడలిస్ట్ పసుపులేటి సురేష్, చేనేత కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి అనుముల వీరబ్రహ్మం, పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం కన్వీనర్ పొట్టి సూర్యప్రకాశరావు, నరసరావుపేటలోని పల్నాడు విజ్ఞాన కేంద్రం కన్వీనర్ లక్ష్మీశ్వరరెడ్డి మాట్లాడుతూ సత్తెనపల్లి ప్రతిష్టను దేశవ్యాప్తంగా ఇనుమడింపజేసిన ఘనత పతక విజేతలు, శిక్షకులకు దక్కిందన్నారు. పట్టుదల, క్రమశిక్షణ, మంచి ఆరోగ్యం, ఆలోచనకు కరాటే దోహదం చేస్తుందన్నారు. అనంతరం క్రీడాకారులు ప్రదర్శించి కరాటే అందర్నీ ఉత్తేజపరిచింది. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి పి.మహేష్, సిపిఎం పట్టణ కార్యదర్శి డి.విమల, ఐద్వా పల్నాడు జిల్లా కార్యదర్శి జి.రజిని, క్రీడాకారులు, బంధువులు పాల్గొన్నారు.

హెల్త్ బ్లాక్ ప్రారంభం



ప్రజాశక్తి-ముప్పాళ్ల

మండలం కేంద్రమైనమ ముప్పాళ్లలోని పిహెచ్‌సి సెంటర్ వద్ద రూ.50లక్షలతో నిర్మించిన ప్రైమరీ హెల్త్ బ్లాక్ యూనిట్‌ను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేసిన ఆయన అనంతరం చాగంటివారిపాలెంలో టిడిపి మండల విస్తృత సమావేశంలో మాట్లాడారు. టిడిపి మండల అధ్యక్షులు బి.నాగేశ్వరరావు, నాయకులు డి.నాగేశ్వరరావు, ఎస్.గోపాలరావు, ఆర్.నానయ్య, కె.వీరభాస్కర్‌రెడ్డి, ఎ.కృష్ణ పాల్గొన్నారు.

పరివర్తన దశలో న్యాయ వ్యవస్థ



మానవీయతలేని శిక్షణ విధానం అనేది ప్రస్తుతం భారత న్యాయవ్యవస్థ ఎదుర్కొంటున్న ఒక ప్రధాన సవాలు. శిక్ష కేవలం ప్రతీకార మార్గం కాకుండా నేరస్తుడిని సంస్కరించేందుకు, సమాజంలో విలీనమయ్యేందుకు దోహదకారిగా ఉండాలి. ఈ నేపథ్యంలో న్యాయపరమైన పునరావాసానికి 'సామాజిక సేవలు' అనే దృష్టికోణం శక్తివంతమైన మార్గంగా అభివృద్ధవుతోంది. సంప్రదాయక శిక్ష విధానాల్లో కారాగార శిక్షలు, ఇతర పద్ధతుల్లో నేరస్తులను శిక్షించే సందర్భాలే ఎక్కువ. ఇది మానవ హక్కుల ఉల్లంఘనతో పాటు, వ్యక్తిని మరింతగా నేర ప్రవృత్తివైపు నెట్టే ప్రమాదం లేకపోలేదు. జైలు శిక్షలు ఖర్చుతో కూడినవే కాక, పెరుగుతున్న విచారణ ఖైదీల సమస్యను అధికంగా పెంచుతున్నాయి. భారత న్యాయవ్యవస్థలో ఉన్న ఆలస్యాల వల్ల ఇదింకా తీవ్రమవుతోంది.

సామాజిక సేవల పరిచయం

ఈ నేపథ్యంలో సామాజిక సేవ శిక్ష అనేది ఒక ప్రత్యామ్నాయ శిక్ష విధానంగా తీసుకోవచ్చు. దీని ప్రకారం.. సమాజానికి ఉపయోగపడే పనులను నేరస్తులు చేయాల్సి ఉంటుంది. పారిశుధ్య పనులు, విద్యా సేవలు, గృహ నిర్మాణాల్లో సహాయం వంటివి ఇందుకు ఉదాహరణలుగా చెప్పొచ్చు. ఈ విధానం నేరస్తుల్లో బాధ్యతాభావాన్ని పెంచి సమాజానికి మేలు చేసేలా ప్రేరేపిస్తుంది. నేరస్తుడి మార్పును బాధితులు ప్రత్యక్షంగా చూస్తారు. మారిపోయిన వ్యక్తి తిరిగి నేరాల జోలికి వెళ్లే అవకాశాలు తగ్గుతాయి. కొత్తగా ప్రవేశపెట్టిన భారతీయ న్యాయ సంహిత (బిఎన్‌ఎస్) ప్రకారం కొన్ని చిన్నపాటి నేరాలకు జైలుశిక్షకు బదులు సామాజిక సేవ శిక్ష అమలు చేయాలని పేర్కొంది. నేరాలు చేసే వ్యక్తి ఒక్కసారిగా నేరసుడిగా పరిగణించకూడదు. వారి వెనుక ఉన్న సామాజిక, ఆర్థిక, మానసిక పరిస్థితులనూ గమనించాలి. అలాంటి వారికి మార్గదర్శనం చేయడానికి సమాజం బాధ్యత తీసుకోవాలి. ఇది పునరావాస న్యాయ ప్రధాన లక్ష్యం. రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 14, 19, 21లు - సమానత్వం, వ్యక్తిగత స్వేచ్ఛ, జీవించే హక్కును ఇచ్చాయి. శిక్ష విధానాల్లో మానవీయత ఉండాలనే సూత్రాన్ని ఇది నిలబెడుతుంది. యుడిహెచ్ఆర్, ఐసిసిపిఆర్ వంటి అంతర్జాతీయ ఒప్పందాల్లోనూ ఇదేఉంది.

చట్టాల మార్పులు-నూతన ఆశ

బిఎన్‌ఎస్‌లో కొన్ని ముఖ్యమైన సెక్షన్లు... సెక్షన్ 4(1)చిన్న నేరాలపై జైలు శిక్షకు బదులుగా సామాజిక సేవల అవకాశాన్ని కల్పిస్తున్నాయి. నేరం చేసిన వ్యక్తి సమాజం కోసమే పనిచేయడం ద్వారా, బాధితులకు సమాజానికి ఓ సానుభూతి సంకేతం అందుతుంది. ఇది ఒక అవగాహనాత్మక మార్గం, వ్యక్తిలో మార్పును ప్రేరేపిస్తుంది. జైళ్లలో ఖైదీల సంఖ్యను, ప్రభుత్వ ఖర్చునూ తగ్గిస్తుంది. అయితే సామాజిక సేవలను ఎలాంటి పనిగా ఉపయోగించాలి? ఆ పనులు ఎంత సమర్థవంతంగా ఉన్నాయి? అనే అంశంలో స్పష్టత లోపించవచ్చు. న్యాయమూర్తులు, న్యాయ వాదులు, పోలీసు అధికారులు ఇంకా ఈ విధానంపై సరైన అవగాహన కలిగి లేరు. ఈ క్రమంలో సామాజిక సేవల అమలుకు ప్రత్యేక మార్గదర్శకాలు రూపొందించాలి. శిక్షణివ్వాలి. సామాజిక సేవ కేంద్రాలు ఏర్పాటు చేసి, జిల్లాల వారీగా కమ్యూనిటీ సెంటర్ల ద్వారా అమలు చేయాలి. సామాజిక సేవను విజయవంతంగా పూర్తి చేసినవారికి గుర్తింపు ఇవ్వాలి. సామాజిక సేవలు అంటే కేవలం నేరానికి మారుగా పనులు చేయడం మాత్రమే కాదు. అది వ్యక్తిని తిరిగి సమాజంలో విలీనం చేయడం, అతనిలో మానవీయతను, ఆత్మవిశ్వాసాన్ని పెంచడం ద్వారా సమాజంలో శాంతిని, న్యాయాన్ని స్థాపించవచ్చు. భారత న్యాయవ్యవస్థ ఇప్పుడు మారుతున్న దశలో ఉంది. ఈ మార్పు దిశగా సామాజిక సేవలు ఒక దీపం వలె మార్గదర్శకంగా నిలవాలి.



వేమూరి సుబ్రహ్మణ్య శశాంక్, బిబిఎ (ఐదవ సంవత్సరం), ఎల్ఎల్‌బి (హానర్స్), విజ్ఞాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ లా, విఎఫ్ఎస్‌టిఆర్, గుంటూరు.



కొరప్రాటి రోహిణి, బిఎ (ఐదవ సంవత్సరం), ఎల్ఎల్‌బి (హానర్స్), విజ్ఞాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ లా, విఎఫ్ఎస్‌టిఆర్, గుంటూరు.

కలెక్టర్ గ్రీవెన్స్‌కు 221 అర్జీలు

ప్రజాశక్తి-గుంటూరు

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన ప్రతి అర్జీని నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జేసీ శ్రీవాస్తవ, డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మికుమారి, డిఆర్‌ఓ ఎన్.ఎస్.కె.ఖాజావలి ప్రజల నుండి 221 పిర్యాదులను స్వీకరించారు. జేసీ మాట్లాడుతూ ప్రజలలో సంతప్తి స్థాయిని పెంచేలా అధికారులు కషి చేయాలని, జిల్లా అధికారులు క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్ళి గ్రీవెన్స్‌లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి సమస్యను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్, ఇతర అధికారులు

కాంట్రాక్ట్ కార్మికులకు బకాయిలు ఇవ్వాలి..

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులకు జాతీయ, పండుగ సెలవు దినాలకు చెల్లించవలసిన బకాయిలను తక్షణమే చెల్లించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు గ్రీవెన్స్‌లో అర్జీ అందచేశారు. విద్యుత్ శాఖ కాంట్రాక్ట్ కార్మికులకు 2018 నుండి 2022 వరకూ జాతీయ, పండుగలకు చెల్లించాల్సిన బకాయిలు తక్షణమే చెల్లించాలని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.నాగరాజు కోరారు. బకాయిలు చెల్లించాలని పదేపదే అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేదన్నారు. పలుమార్లు ఆందోళణ చేసిన ఫలితంగా బడ్జెట్ రిలీజ్ అయ్యిందని, కానీ కార్మికులకు బిల్లులు వేసి చెల్లించాల్సిన అధికారులు చెల్లించని కారణంగా కార్మికులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. సీఎండి ఉత్తర్వులు ఇచ్చినా అధికారుల్లో ఏమాత్రం స్పందన లేదన్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి కార్మికులకు బకాయిలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అర్జీ ఇచ్చిన వారిలో జిల్లా గౌరవాధ్యక్షులు బి లక్ష్మణరావు, భాషా, రాంబాబు, పవన్ తదితరులున్నారు.

యానాది కుటుంబాలకు స్థిర నివాసం ఏర్పాటు చేయాలి...

గుంటూరు, 51వ డివిజన్, కాకుమాను వారి తోటలోని కార్మికశాఖ స్థలంలో నివాసం ఉంటున్న 22 యానాది కుటుంబాలకు స్థిర నివాసం ఏర్పాటు చేయాలని బహుజన మహాసభ నాయకులు గ్రీవెన్స్‌లో అర్జీ అందజేశారు. గత 20 సంవత్సరాలుగా చిన్నచిన్న డేరాలు ఏర్పాటు చేసుకొని కరెంటు, నీటి సౌకర్యం లేక, ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ జీవిస్తున్నారని తెలిపారు. 2015లో ఇళ్ల స్థలాల కోసం పలుమార్లు అర్జీ ఇవ్వగా, ఆర్.ఐ వచ్చి, విచారణ జరిపి, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని తహసీల్దార్‌కు నివేదిక ఇచ్చారన్నారు. 2022లో వట్టిచెరుకూరు మండలం, కొర్నెపాడులోని జగనన్న కాలనీలో ఇండ్ల పట్టాలు ఇచ్చినా, స్థలాలు మాత్రం చూపించలేదన్నారు. కావున ఇప్పటికైనా అధికారులు స్పందించి వీరికి స్థిర నివాసం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అర్జీ ఇచ్చిన వారిలో బహుజన మహాసభ నాయకులు భగత్ సింగ్, జూపూడి శ్రీనివాసరావు, ఉగ్గం సాంబశివరావు తదితరులు ఉన్నారు.

గుంటూరులో డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేయాలి

గుంటూరు నగరంలో డ్రైనేజీ వ్యవస్థ వల్ల ప్రజలు అవస్థలు పడుతున్నారని, తక్షణమే డ్రైనేజీ వ్యవస్థను బాగు చేయాలని కాంగ్రెస్ నాయకులు గ్రీవెన్స్‌లో అర్జీ అందజేశారు. ఆదివారం కురిసిన వర్షానికి అన్ని ప్రాంతాలూ వరద నీటితో మునిగిపోయాయన్నారు. దారులు అన్నీ మూసుకుపోయాయన్నారు. అధికారులు కారుల్లో కాకుండా ద్విచక్ర వాహనాలపై ప్రయాణిస్తే సమస్య అర్థం అవుతుందన్నారు. కోట్లాది రూపాయలు పన్నులు కడుతున్నా ప్రజలకు మాత్రం అవస్థలు తప్పట్లేదన్నారు. కొత్త కాల్వల నిర్మాణం వల్ల కాంట్రాక్టర్లు బాగుపడుతున్నారని, ప్రజలకు మాత్రం ఎలాంటి ఉపయోగం ఉండట్లేదన్నారు. కొత్త కాల్వలు, పాత కాల్వలకు తేడా లేదని తెలిపారు. పీకలవాగు కొట్టుకుపోయి వాహనాలు కొట్టుకుపోయాయన్నారు. కావున ఉన్నతాదికారులు స్పందించి నగరంలో డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదలకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అర్జీ ఇచ్చిన వారిలో కాంగ్రెస్ నాయకులు బిళ్లా సునీల్, బి.బ్రహ్మయ్య, వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

తురకపాలెం మృతులకు కుటుంబాలకు పరిహారం ఇవ్వాలి

తురకపాలెం గ్రామంలో అంతుచిక్కని కారణాలతో మరణించిన వారి కుటుంబాలకు తక్షణమే పరిహారం ఇవ్వాలని విదసం ఐక్యవేదిక ఆధ్వర్యంలో మతుల కుటుంబ సభ్యులతో కలిసి గ్రీవెన్స్ లో అర్జీ అందజేశారు. ఒక్కొక్క కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలన్నారు. ప్రభుత్వం అనారోగ్య సమస్యలపై పరిశీలనకు మాత్రమే పరిమితమై, కుటుంబాలకు పెద్ద దిక్కుగా ఉన్న వ్యక్తులు మరణిస్తే వారికి పరిహారం ఇవ్వకపోవడం బాధాకమన్నారు. ఈఘటనలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని, నిజాలు నెగ్గు తేల్చడానికి సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అర్జీ ఇచ్చిన వారిలో ఐక్యవేదిక అధ్యక్షులు బూసి వెంకటేశ్వరరావు, భీమ్ సేన సేవాదళ్ నాయకులు నల్లపు నీలాంబరం, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు డి. జాన్ పాల్, మాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు బి. స్టాలిన్ బాబు తదితరులున్నారు.

తురకపాలెం మరణాలకు కారణాలు వెల్లడించాలి

తురకపాలెంలో సంభవించిన మరణాలకు కారణాలపై ప్రభుత్వం రోజుకో మాట చెబుతూ ప్రజల్ని మరింత ఆందోలనకు గురి చేస్తుందని వైసిపి ప్రత్తిపాడు ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్ అన్నారు. బాధిత కుటుంబాలకు పరిహారం కోరుతూ వైసిపి నాయకులు గ్రీవెన్స్‌లో అర్జీ అందచేశారు. గ్రామంలో త్రాగునీటి సమస్యపై ఐదు నెలల క్రితమే గ్రామస్తుల సంతకాలతో గ్రీవెన్స్‌లో అర్జీలు ఇచ్చినా పట్టించుకోలేదన్నారు. మెలియోడిసిస్ అని ఎంపి, నీటి సమస్య అని ఆరోగ్యశాఖ మంత్రి, మద్య వల్ల చనిపోయారని ఎమ్మెల్యే మాట్లాడుతున్నారన్నారు. ఇప్పుడు యురేనియం అంటున్నారన్నారు. ప్రభుత్వం ఇంత వరకూ సరైన కారణాలు నిర్ధారించలేదన్నారు. మూడు వారాల నుండి అనేక పరీక్షలు చేసినా సరైన కారణం చెప్పలేకపోతున్నారన్నారు. చనిపోయిన వారిలో ఎస్సీ, బిసి, మైనార్టీలు అత్యధికంగా ఉన్నారన్నారు. తక్షణమే కారణాలు తేల్చాలని, బాధితులకు పరిహారం ఇవ్వాలని కోరారు



వరద నీటిని తొలగించాలి : సిపిఎం

ప్రజాశక్తి-గుంటూరు



అర్జీ ఇచ్చిన సిపిఎం నాయకులు, ప్రజలు

భారీ వర్షాల నేపథ్యంలో వరద నీరు ఇళ్లలోకి వచ్చి తీవ్ర ఇబ్బందులకు గుంవుతున్న ప్రాంతాల్లో యుద్ధ ప్రాతి పదికన నీళ్లు పంపించే చర్యలు చేపట్టాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎల్.అరుణ డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలో వర్షపు నీటి మంపు ప్రాంతాల్లో సిపిఎం నగర నాయకత్వం పర్యటించారు. అనంతరం గ్రీవెన్స్‌లో కమిషనర్‌కు వినతిపత్రం అందచేశారు. పాత గుంటూరు ప్రాంతంలోని శ్రామిక నగర్లో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక వర్షపు నీటిలో పాములు, తేళ్లు, విషపురుగులు ఇళ్లలోకి వచ్చి ప్రజల్ని భయభ్రాంతులకు గురి చేస్తున్నాయన్నారు. బిఆర్ స్టేడియం ప్రాంగణంలో గతంలో మెరక తోలుతూ పక్కనే ఉన్న శ్రామిక నగర్ డ్రైనేజీ కాలువను పూడ్చివేశారని, దీంతో పక్కనే ఉన్న శ్రామిక నగర్లో ఇళ్లలోకి నీళ్లు వచ్చి రెండు మూడ్రోజులపాటు నిల్వ ఉంటున్నాయన్నారు. గతంలో అనేకసార్లు అధికారులకు విన్నవించినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. వర్షపు నీటిని బయటకు పంపించేందుకు స్టేడియంలో తాత్కాలికంగా కాలువ తీయించినా ప్రయో జనం లేకుండా పోయిందన్నారు. నీరు నిలిచి దోమలు పెరిగి ప్రజలు జ్వరాలబారిన పడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి కె. నళిని కాంత్ స్థానిక మహిళలు ఆదిలక్ష్మి, కుమారి, వరలక్ష్మి, బాలమ్మ ,మాధవి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాపై దృష్టి సారించాలి...

భారీ వర్షాల నేపథ్యంలో త్రాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం జిఎంసి కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించి 28 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారుల్ని ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి రిజర్వాయర్ నుండి టెయిల్ ఎండ్ పాయింట్ వరకు క్లోరిన్ శ్యాంపిల్స్ తీయాలన్నారు.తొలుత డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమంలో 20 ఫిర్యాదులు స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, ఇంచార్జి ఎస్ఈ సుందర్రామిరెడ్డి, మేనేజర్ బాలాజీ బాష పాల్గొన్నారు.

మతోన్మాదానికి వ్యతిరేకంగా ప్రజలను సంఘటితం చేయాలి

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

సిపిఎం నేత సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి, నాయకులు అప్పికట్ల శ్రీనివాసరావు 8వ వర్ధంతి సభలను మంగళగిరి మండలం కాజలోని సుందరయ్య భవన్లో నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాం ఏచూరి, అప్పికట్ల శ్రీనివాసరావు చిత్రపటాలకు నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. సభకు సిపిఎం పార్టీ కాజ 1వ శాఖ కార్యదర్శి తమ్మా ప్రసాద్‌రెడ్డి అధ్యక్షత వహించారు. సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు మాట్లాడుతూ మతోన్మాదానికి వ్యతిరేకంగా ప్రజలందరినీ సంఘటితంగా చేయటమే సీతారాం ఏచూరికి, అప్పికట్ల శ్రీనివాసరావుకు ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. సీతారాం ఏచూరి సిపిఎం పార్టీ అఖిల భారత కార్యదర్శిగా, వామపక్ష ఉద్యమానికి, లౌకిక శక్తులు ఐక్యంగా నిలవడానికిగా నిలబడటానికి ఎనలేని కృషి చేశారని తెలిపారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా ప్రజలందరినీ ఐక్యంగా నిలిపేందుకు కృషి చేశారని తెలిపారు. అప్పికట్ల శ్రీనివాసరావు కాజా గ్రామ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని, ఉత్తమ పంచామతీగా తీర్చిదిద్దారని తెలిపారు. నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలు అమలు చేస్తున్నాయని, నిరంకుశత్వంతో ప్రజాస్వామిక విలువలను కాలరాస్తున్నాయని రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కుతున్నాయని, వీటికి వ్యతిరేకంగా ప్రజలందరిని సమీకరించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం లక్షలాది ఎకరాల భూమిని బలవంతంగా సేకరించి కార్పొరేట్ సంస్థలకు కారు చౌకగా కట్టపెట్టేందుకు కుట్రలు చేస్తుందని తెలిపారు. నియోజకవర్గంలో 25 వేల మంది ఇళ్లు లేని పేదలు ఉన్నారని, ఎన్నికల సందర్భంగా నారా లోకేష్ ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారని ఎన్నికల అనంతరం ఆ ఊసే ఎత్తటం లేదని విమర్శించారు. ఇటీవల వర్షాలకు దెబ్బతిన్న గుంటూరు ఛానల్ కాలువగట్లను పటిష్టవంతంగా మరమ్మతులు చేయాలని కోరారు. సీతారాం ఏచూరి, అప్పికట్ల శ్రీనివాసరావు ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం కాజ రెండో శాఖ కార్యదర్శి సింహాద్రి సుమ, సీనియర్ నాయకులు ఈదా ప్రతాపరెడ్డి, ఆళ్ల సాంబిరెడ్డి, గాదె మాధవరెడ్డి, గాదె గోపాల్ రెడ్డి, భీమిరెడ్డి సత్యమారెడ్డి, సింహాద్రి శేఖర్ రెడ్డి, సింహాద్రి నిర్మల, ఆర్దల జ్యోతి, అప్పికట్ల ప్రకాశరావు, గాదె రామారావు, బ్రహ్మారెడ్డి, మేడ శివయ్య సిపిఐ ఎంఎల్ నాయకులు ఎం .అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు



ఆర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ శ్రీకాంత్

పిజిఆర్ఎస్‌కు ఆరు అర్జీలు

ప్రజాశక్తి - తెనాలి

ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని త్వరితగతిన పరిష్కరించేందుకు సోమవారం స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆరు అర్జీలు దాఖలైనట్లు కమిషనర్ పి.శ్రీకాంత్ వెల్లడించారు. 28వ వార్డులో సైడ్ కాలువలు నిర్మించాలని, మూడవ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణం కొరకు, 16వ వార్డులో వీధి కుక్కల సమస్య పరిష్కరించాలని తదితర సమస్యలపై అర్జీలు దాఖలయ్యాయని తెలిపారు. సంబంధిత విభాగాలకు అర్జీలను పంపించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ పి.వాణి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో మొత్తం 15 అర్జీలు దాఖలు అయ్యాయి. వాటిలో రెవెన్యూ శాఖకు సంబంధించి 5, మున్సిపాలిటీకి సంబంధించి ఐదు, పోలీసు శాఖకు సంబంధించి మూడు, పంచాయతీరాజ్, ఇరిగేషన్ శాఖలకు సంబంధించి ఒక అర్జీ దాఖలైనట్లు అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కార్యాలయ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - గుంటూరు

ఇంజినీర్స్‌డే సందర్భంగా లలితా హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఎపి పంచాయతీరాజ్ ఇంజినీర్స్ అసోసియేషన్, అసోసియేషన్ ఆఫ్ సెక్రటేరియట్ ఇంజినీర్స్ సభ్యుల కోసం జెడ్పీ ప్రాంగణంలో సోమవారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. 150 మందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. హాస్పిటల్ సైకియాట్రిస్ట్ డాక్టర్ పి.అజయ్ మానసిక ఆరోగ్యం, ముఖ్యంగా డిప్రెషన్, ఆందోళనపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఇంజినీర్ల శ్రేయస్సు కోసం ఇలాంటి కార్యక్రమాలు కొనసాగిస్తామని చెప్పారు.

విజ్ఞాన్స్‌లో ఇంజినీర్స్ డే వేడుకలు

ప్రజాశక్తి - గుంటూరు



మాట్లాడుతున్న డాక్టర్ నాడగౌడ

విజ్ఞాన్స్ యూనివర్సిటీలో ఇంజనీర్స్ డే వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా బెంగళూరు యూఆర్‌రావ్ శాటిలైట్ సెంటర్ ప్రాజెక్టు అసోసియేషన్ డైరెక్టర్, శాస్త్రవేత్త డాక్టర్ ఆర్.వి.నాడగౌడ పాల్గొన్నారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ అంతరిక్ష సాంకేతికత ప్రాధాన్యత గురించి విద్యార్థులతో పంచుకున్నారు. ప్రపంచంలో వేగంగా వస్తున్న మార్పులను విద్యార్థులు గమనించాలన్నారు. హైదరాబాద్‌లోని స్కైరూట్ ఏరోస్పేస్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సీవీఎస్ కిరణ్ మాట్లాడుతూ దేశానికి ఉద్యోగాలు సృష్టించే యువత అవసరమని చెప్పారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ ఛైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, వీసీ ప్రొఫెసర్ నాగభూషణ్, సిఈఓ డాక్టర్ మేఘన కూరపాటి, తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ హెచ్‌ఎం వెంకటరావు మృతి

ప్రజాశక్తి - గుంటూరు



వెంకటరావు(ఫైల్)

డాక్టర్ కెఎల్‌పి స్కూల్ గౌరవ జాయింట్ సెక్రటరీ, పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్ రిటైర్డ్ హెచ్‌ఎం కొండబోలు వెంకటరావు (73) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. నాగార్జునా ఎడ్యుకేషన్ సొసైటీ సభ్యులుగా ఉన్నారు. ఆయన అంతిమయాత్ర మంగళవారం ఉదయం 9 గంటలకు ఆయన స్వగృహం సిద్ధార్థ నగర్, 3వ లైన్ నుండి స్తంభాలగరువు మహాప్రస్థానంలో నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.


మాట్లాడుతున్న వశిష్ట కళాశాల డైరెక్టర్ నరేష్ కుమార్

జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు వశిష్ట కాలేజీ విద్యార్థులకు ఎంపిక

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా జట్టు ఎంపికలో తమ విద్యార్థులు ప్రతిభ చాటి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని వశిష్ట జూనియర్ కళాశాల డైరెక్టర్ మద్దుల నరేష్ కుమార్ అన్నారు. నరసరావుపేట పట్టణం రెడ్డి నగర్‌లోని తమ కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నరేష్‌కుమార్ మాట్లాడుతూ జూనియర్ బాల బాలికల కబడ్డీ జిల్లా జట్టు ఎంపిక పోటీలలో తమ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటారన్నారు.ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో జిల్లా జట్టు కి ఎంపికైన విద్యార్థులు జయప్రకాష్, డి.శ్రావణి, ఎస్.అక్షయ, ఎన్.శ్రావణిని అభినందించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ఛైర్మన్ నర్రా శేషగిరిరావు, పిడి.వై సురేష్, డైరెక్టర్లు నల్లపాటి శ్రీకాంత్, భవిరిశెట్టి మదన రాజారావు, ప్రిన్సిపల్ శివ నాగేశ్వరరావు అధ్యాపకులు సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షునిగా భీమానాయక్

ప్రజాశక్తి - విజయపురిసౌత్


భీమా నాయక్‌ను సత్కరిస్తున్న అతిథులు

ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా మాచర్ల మండలం చింతలతండా గ్రామానికి చెందిన రమావత్ భీమా నాయక్, పల్నాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తాళ్లపల్లి గ్రామానికి చెందిన బాణావత్ వెంకటేష్ నాయక్ ఎన్నికయ్యారు. గుంటూరులోని పోలీస్ కల్యాణ మండపంలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాణావత్ చక్రి నాయక్ ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నిక నిర్వహించారు. భీమానాయక్ మాట్లాడుతూ బంజారాల సంస్కతి, సాంప్రదాయాలను కాపాడుతూ వారి అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తానన్నారు. భీమా నాయక్, వెంకటేష్ నాయక్‌ను పలువురు అభినందించారు.


ఫ్రాంక్లిన్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సరోజిని

క్రికెట్‌లో ఎపిఆర్‌జెసికి తృతీయ స్థానం

ప్రజాశక్తి - విజయపురిసౌత్

న్యూటాన్స్ ఇంజనీరింగ్ కళాశాల ఈనెల మూడవ తేదీ నుండి 14 తేదీ వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి జూనియర్ కాలేజి క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా ఆదివారం జరిగిన మ్యాచ్‌లో నాగార్జునసాగర్ ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల విద్యార్థులు తృతీయ స్థానంలో గెలుపొందారు. వీరు మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి రూ 15 వేలు, ప్రశంసాపత్రాలు, మెడల్స్‌ను అందుకోవ టం గర్వంగా ఉందని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఫ్రాంక్లిన్‌ను కళాశాల ప్రిన్సిపల్ ఎన్.సరోజినీ అభినందించారు. ఫ్రాంక్లిన్ మాట్లాడుతూ ఈ అవకాశం కల్పించిన కళాశాల ప్రిన్సిపాల్‌కి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం కళాశాల సిబ్బంది, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ఫ్రాంక్లిన్‌ని అభినందించారు.


రాజుపాలెంలో పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మీనారాయణ


వినుకొండలో ఎమ్మెల్యే ఆంజనేయులు...

ఎమ్మెల్యేల ద్వారా స్మార్ట్ రేషన్ కార్డులు

ప్రజాశక్తి - రాజుపాలెం

రాజుపాలెం మండల కేంద్రంలో సోమవారం సత్తెనపల్లి శాసన సభ్యులు కన్నా లక్ష్మీనారాయణ స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్ళుగా కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తోందన్నారు. అనంతరం లబ్ధిదారుడు చొక్కా గాలయ్య కుటుంబ సభ్యులకు స్మార్ట్ రేషన్ కార్డుని అంద జేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు అంచుల నరసింహారావు, పులిబండ్ల సాంబశివరావు, జెట్టి కోటేశ్వరరావు, పెద్దింటి శ్రీనివాసరావు, లేబాకుల బ్రహ్మయ్య, చొక్కా రాంబాబు, యమర్తి వెంకట్రావు, వాసా నాగేశ్వరరావు, చొక్కా బుల్లెబ్బాయి, జలపాటి సోమయ్య, గుడారీ గంగా రావు, తోటసుభాష్, దూడుకు శ్రీనివాసరావు, అధికారులు, కూటమినేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - అచ్చంపేట

అచ్చంపేట తహాశీల్దార్ ఎస్.చంద్రశేఖర్ లబ్దిదారులకు స్మార్టు కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నియోజక వర్గం మహిళా అధ్యక్షురాలు చల్లా అనుపకళ, మండల కన్వీనర్ నందిగామ ఆశీర్వాదం, వి.కోటయ్య, వై.బుచ్చిబాబు, టి. ఆంజనేయులు కె.చంటి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - వినుకొండ

రాష్ట్రంలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశ పెడుతోన్న స్మార్ట్ రేషన్ కార్డులతో ప్రజలకు బహుళ ప్రయోజనాలు లభిస్తాయని వినుకొండఎమ్మెల్యే, చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. వినుకొండలోస్థానిక 12వ వార్డు అంబేడ్కర్‌కాలనీలో లబ్ధిదారులకు కార్డులు అందజేశారు. జిడిసిసిబి చైర్మన్ ఎం.మల్లికార్జునరావురావు జనసేన నాయ కులు నాగశ్రీనురాయల్, కౌన్సిలర్లు, నాయకులు, పాల్గొన్నారు.

ప్రజాశక్తి - అమరావతి

అమరావతి మండలం ధరణికోటలోని జైల్‌సింగ్ కాలనీలో పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ స్మార్ట్ కార్డు లు అందజేశారు. మండల ఎమ్మార్వో, డాని యల్, మండల టిడిపి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మాచర్ల

స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గంలోని లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులను ఎమ్మెల్యే జూలకంటి పంపిణీ చేశారు. ఆర్డీవో మురళీ, ఐదు మండలాల తహాశీల్దార్లు కిరణ్‌కుమార్, వెంకటేశ్వరనాయక్, కరుణ కుమార్, రాజశేఖర్, కనకం మేరి, మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, మార్కెట్‌యార్డు చైర్మన్ రాజబోయిన మల్లేశ్వరి మధు, వడ్డెర కార్పోరేషన్ డైరెక్టర్ కొమెర దుర్గారావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట పట్టణం రామిరెడ్డిపేట 24వ వార్డులో నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు పాల్గొని లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ప్రసాద్, ఆర్డీఓ కె.మధులత, తహశీల్దార్ కె.వేణుగోపాలరావు, క్లస్టర్ ఇంచార్జ్ రావిళ్ళ పెద్ద నాగేశ్వరరావు, వార్డు నాయకులు బెల్లం కష్ణ, దొడ్ల పరమేశ్వరరావు, జానీ ఉమ్మడి కూటమి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి పట్టణంలోని 10లో వార్డులో స్మార్ట్ రేషన్ కార్డులను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సత్తెనపల్లి ఆర్డీవో జీ రమణకాంతరెడ్డి , తహశీల్దార్ కె ఎస్ చక్రవర్తి టిడిపి పట్టణ అధ్యక్షులు మస్తాన్వలి టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదకూరపాడు

స్మార్ట్ రేషన్ కార్డులను పెదకూరపాడు తహాశీల్దార్ ఎన్ ధనలక్ష్మి అధికారులు, టిడిపి నాయకులతో స్థానిక పంచాయతీరాజ్ గెస్ట్ హౌస్‌లో లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు ఏటుకూరి బ్రహ్మయ్య, పార్టీ జిల్లా కార్యదర్శి అత్తిమళ్ళ రమేష్, పెదకూరపాడు సర్పంచ్ గుడిపూడి రాజు, టిడిపి సీనియర్ నాయకులు భాష్యం ఆంజనేయులు, గల్లా బాబురావు, షేక్ ముంతాజు పాల్గొన్నారు.

గాలికుంటు నిరోధక టీకాలు ప్రారంభం

ప్రజాశక్తి - క్రోసూరు

మండలంలో గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాని సర్పంచ్‌కలకోటి ఏసమ్మ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి టీకాల వల్ల వ్యాధి సోకినా పాడి పశువుల్లో తగ్గే పాల ఉత్పత్తిని శాశ్వతంగా నివారించవచ్చని తెలిపారు. క్రోసూరు పశువైద్యాధికారి డాక్టర్ షేక్ బషీర్ మాట్లాడుతూ ఈ వ్యాధి అతి సూక్ష్మజివికారక పికొర్న వైరస్ వలన వ్యాధి వస్తుందన్నారు. ఈ వ్యాధి పశువుల నుండి మనుషులకు, మనుషుల నుండి పశువులకు గోళ్లుర, దుసులు, బూట్ల ద్వారా వ్యాపిస్తుందని తెలిపారు. పశు వైద్య సహాయకురాలు అంకాల. మణి, అనిమల్ హాస్బెండ్రి అసిస్టెంట్స్ చట్టు గోపి, ఆంజనేయులు నాయక్, షేక్‌పర్వీన్, ఇంద్రాణ, గోపాల మిత్ర కోటి రామ్మూర్తి, గ్రామపెద్దలు, రైతులు పాల్గొన్నారు.



ఆరోగ్యానికి ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు

ప్రజాశక్తి - యడ్లపాడు

ప్రకృతి వ్యవసాయ విధానంలో పండించిన ఆహార ఉత్పత్తులతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి ఏహరిప్రసాద్ అన్నారు. సోమవారం యడ్లపాడు మండలంలోని యడ్లపాడు తహశీల్దార్ కార్యాలయంలో రసాయనాలులేని ప్రకృతి వ్యవసాయ విధానంలో ఏ గ్రేడ్, ఏటీఎం, న్యూట్రిన్ గార్డెన్, పెరటి తోటలో పండించిన ఉత్పత్తులను నేరుగా రైతు అమ్ముకునేం దుకు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ ప్రతి మహిళ పెరటి తోటలు పెంచి, కషాయాలను వాడటం ద్వారా ఆరోగ్యకరమైన కూరగాయలు, పొందవచ్చున్నారు. యూనిటీ ఇన్చార్జి పరమాత్ముల కోటేశ్వరము వెంకటేశ్వరరావు, రైతులు వేణు, ఉదయలక్ష్మి, రామ కోటేశ్వర రావు, సీతారామయ్య, డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

20న చేపల చెరువుల వేలం

ప్రజాశక్తి-ఈపూరు

మండలంలోని కొచ్చర్ల గ్రామపంచాయతీలోని మంగళవాని చెరువులో 2025-26, 2026-27 సంవత్సరాలకు సంబంధించి చేపలు పెంచేందుకు ఈనెల 20వ తేదీ గ్రామ పంచాయతీ కార్యాలయంలో మధ్యాహ్నం రెండు గంటలకు వేలంపాట నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి ఎం. తిరుపతయ్య ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో పాల్గొనేవారు ఒక్కరికి ధరావతు రూ. 50 వేలు చెల్లించాలని పేర్కొన్నారు. బోడేపూడివారి పాలెం గ్రామ పంచాయతీలోని చెరుకూరువారి, ఈదనపు వారి చెరువులో రెండేళ్ళ చేపలు పెంచేందుకు ఈనెల 20వ తేదీన గ్రామపంచాయతీ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు వేలంపాట నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి ఎం.హిమబిందు తెలిపారు.

లేమల్లెలో అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - అమరావతి

మండలంలోని లెమల్లె గ్రామ పంచాయతీలో అభివృద్ధికి పనులను సోమవారం ప్రారంభించారు. త్వరలో పార్క్ చుట్టూ లైటింగ్ ఏర్పాటు చేస్తామని సర్పంచ్ పున్నమ్మ, పంచాయతీ కార్యదర్శి బందెల రమేష్ తెలిపారు. రమేష్ రాట్లాడుతూ ఉన్న పాఠశాల అప్‌గ్రేడ్ అయిన ఎంపిపి స్కూల్ పిల్లలు పార్క్ గ్రౌండును వినియోగించుకోవచ్చున్నారు. భాష్యం ప్రవీణ్‌కు ధన్యవాదములు తెలిపారు. గ్రామ నాయకలు యేసుపాదం, జానీ మొగలయ్య, నబి, గోవర్ధన్, గంగాధర్, కోటేశ్వరరావు, శ్రీనివాసారావు, తెలుగు దేశం నాయకులు, యువగళం టీం, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా ఇంజినీర్స్ డే

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం ద్వారా సృష్టికి ప్రతిసృష్టిని ఆవిష్కరించి ఆధునిక సమాజ నిర్మాణానికి కృషి చేస్తున్న ఇంజనీర్లు అభినందనీయులని సత్తెనపల్లి పట్టణ లయన్స్‌క్లబ్ అధ్యక్షులు లయన్ బండ్లమూడి వీరాంజనేయులు అన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇంజనీర్, భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సోమవారం నిర్వహించారు ఉత్తమ సేవలు అందిస్తున్న ఇంజనీర్లను గుర్తించి సత్కరించారు. నీటిపారుదల శాఖ ఈఈ మురళీధర్ రావు, ఏఈఈ అనూష, ఏఈ సుందర్ రావు, పంచాయతీరాజ్ డిఇ శేఖర్‌బాబు, ఎలక్ట్రికల్ ఏఈ పి తిరుపతయ్య, మున్సిపల్ ప్లానర్ తోట చినసాంబశివయ్యను సత్కరించారు. లయన్స్‌క్లబ్ సభ్యులు లయన్‌కంబాల వెంకటేశ్వరరావు, లయన్ టి భావనారాయణ, లయన్ పి. వెంకటేశ్వర్లు, లయన్ పి.కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మాచర్ల

మాచర్ల పట్టణంలోని హౌసింగ్ ఏఈ కార్యాలయంలో సోమవారం ఇంజనీరింగ్ డేను ఘనంగా నిర్వహించారు. హౌసింగ్ కార్యాలయ ఆవరణలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హౌసింగ్ ఏఈ సాతులూరి మరియదాసు, వర్క్ ఇన్స్పెక్టర్లు తేజ, అలీ, అమరయ్య, మహేంద్రకుమార్, ఎలీసమ్మ, పాల్గొన్నారు.

ప్రజాశక్తి-రెంటచింతల

సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణ రూపశిల్పి మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి వేడుకలను సోమవారం టైల్ పాండ్ విద్యుత్తు ప్రాజెక్టులో ఘనంగా నిర్వహించారు మొదట విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రాజెక్టు ఎస్ఈ వెంకటరమణ మాట్లాడారు. కార్యక్రమంలో జిఎం శ్రీనివాస్ ఈఈ సుబ్రహ్మణ్యం డి ఈ గిరిబాబు జయశంకర్ మహమ్మద్ సిబ్బంది పాల్గొన్నారు.


ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

క్రికెట్ టోర్నమెంట్‌లో 'కృష్ణవేణి' విద్యార్థులు విజయం

ప్రజాశక్తి - విజయపురిసౌత్

న్యూటన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో అండర్ -19 ఇంటర్నేషనల్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు పోటాపోటీగా జరిగాయి. టోర్నమెంట్‌లో ప్రకాశం, పల్నాడు, గుంటూరు జిల్లా సంబంధించిన జూనియర్ కళాశాల క్రికెట్ జట్లు పాల్గొన్నాయి. వీరికి బహుమతులను మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి అందజేశారు. మొదటి బహుమతి కృష్ణవేణి జూనియర్ కళాశాల వినుకొండ రూ.25 వేలు, రెండవ బహుమతి ఏపిడబ్ల్యూఆర్ఎస్ జూనియర్ కాలేజీ అచ్చంపేట రూ.20వేలు, మూడోబహుమతి విజయపురిసౌత్ గవర్నమెంట్ జూనియర్ కాలేజీ రూ.15వేలు పొందినట్లు కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జున్నా శ్రీనివాసరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జగదీశ్వర్ రెడ్డి అధ్యాపక బృందం పాల్గొన్నారు.

బాలుర కబడ్డీ రాష్ట్ర జట్టులో శివగోపీకృష్ణ

ప్రజాశక్తి - క్రోసూరు



ఆదివారం అమరావతి హైస్కూల్ సత్తెనపల్లిలో జరిగిన అండర్ బి 20 కబడ్డీ బాలుర విభాగంలో ఏపీ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజీకి చెందిన ఎస్. శివగోపికృష్ణ స్టేట్ లెవల్‌కి ఎంపికయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.మేరీ సుజన్ ఉపాధ్యాయులు అభినం దించారు. తమ విద్యార్థులను చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రోత్సహిస్తున్నామని తెలిపారు.

యూరియా సక్రమంగా పంపిణీ చేయాలి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

రైతులకు పంటలకు అవసరమైన యూరియాను సక్రమంగా పంపిణీ చేయాలని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదంశెట్టి వేదాద్రి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు ఉన్న వారికి రెండు యూరియా కట్టలు మాత్రమే ప్రభుత్వం సరఫరా చేస్తోందనీ, ఇవి రైతులకు సరిపోవని అన్నారు. రైతులకు వెంటనే తగినంత యూరియాని అందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. బ్లాక్ మార్కెట్లో యూరియా అమ్మకాలు నియంత్రించాలని కోరారు.




మాట్లాడుతున్న కె.లక్ష్మి

ఆశ వర్కర్లు పోరాటాలకు సిద్ధం కావాలి

ప్రజాశక్తి - తాడేపల్లి

వేతనాల పెంపు కోసం ఆశ వర్కర్లు పోరాటాలకు సిద్ధం కావాలని ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి కె.లక్ష్మి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ప్రకాష్ నగర్ సిఐటియు కార్యాలయంలో డ్రైవర్ కాలనీ పీహెచ్సీ పరిధిలోని ఆశ వర్కర్ల మహాసభ నిర్వహించారు. సభకు జ్యోతి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ గతంలో అనేక ఆందోళనలు చేసిన ఫలితంగా ఆశా వర్కర్లకు గ్రాడ్యుటి, వయోపరిమితి, వివిధ రకాల సెలవులు జీవో నెంబర్ 94 ద్వారా సాధించుకున్నామని వివరించారు. సమావేశంలో ఆశ వర్కర్ సీనియర్ మండల గౌరవ అధ్యక్షులు వేముల దుర్గారావు మాట్లాడారు. అనంతరం డ్రైవర్ కాలనీ ఆశ వర్కర్లు అధ్యక్షులు, కార్యదర్శులుగా ఎస్ విజయలక్ష్మి, కె.జ్యోతి, కోశాధికారిగా బేబీ మరో 8 కమిటీ ఏర్పడింది. ఈ కార్యక్రమంలో మండల ఆశా వర్కర్ల యూనియన్ కార్యదర్శి వేముల రేణుక, కరుణ కుమారి, బేబీ విజయశ్రీ, వినోద్ని తదితరులు పాల్గొన్నారు.



తహశీల్దార్‌ను ఆహ్వానిస్తున్న డాక్టర్

17 నుంచి స్వస్థ నారి స్వశక్తి పరివార్ అభియాన్

ప్రజాశక్తి - దుగ్గిరాల

కేంద్ర ప్రభుత్వం ప్రారంభించబోతున్న ఆరోగ్యవంత మైన స్త్రీ, శక్తివంతమైన కుటుంబం (స్వస్థ నారి స్వశక్తి పరివార్ అభియాన్) కార్యక్రమం ఈనెల 17వ తేదీ నుండి అక్టోబర్ రెండో తేదీ వరకు మండల వ్యాప్తంగా చేపట్టనున్నట్లు స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి ఇజాస్ అబ్దుల్ రెహమాన్ సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహిస్తామని అందులో వైద్య సలహాలతో పాటు బీపీ షుగర్ క్యాన్సర్ స్క్రీనింగ్, గర్భిణీ పరీక్షలు, వ్యాధి నిరోధక టీకాలు తదితర సలహాలు సూచనలు ఇస్తారని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తహశీల్దార్ ఐ.సునీతను ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో వి.చంద్రమోహన్ ఏపిఎం సురేష్ కుమార్, వైద్య శాఖ సిబ్బంది సుబ్బారావు, కాజా రాజు పాల్గొన్నారు.

18న ఆరోగ్య శిబిరం

ప్రజాశక్తి- తాడేపల్లి

స్వస్థ నారి స్వశక్తి పరివార్ అభియాన్ పేరిట ఈనెల 18వ తేదీను యుపిహెచ్‌సి (డ్రైవర్ కాలనీలో) ఆరోగ్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రధాన వైద్యులు డాక్టర్ మానస మంజరి తెలిపారు. శిబిరంలో మహిళలకు సంబంధించి గుండె జబ్బులు, మధుమేహం, గర్భాశయ క్యాన్సర్, రక్తహీనత వంటి వ్యాధులకు చికిత్స అందిస్తామని తెలిపారు. ప్రజలు వైద్య శిబిరాలను వినియోగించు కోవాలని కోరారు.



అదుపు తప్పిన లారీ

అదుపు తప్పిన లారీ

ప్రజాశక్తి - దుగ్గిరాల

స్థానిక సినిమా హాల్ సమీపంలో సోమవారం ఉదయం జరిగిన ప్రమాదంలో లారీ అదుపు తప్పింది. ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. కారును తప్పించే క్రమంలో అదుపు తప్పి డెల్టా ప్రధాన కాలు బకింగ్ హోమ్ కెనాల్ గట్టుపై బోల్తా కొట్టింది. లారీ లోడుతో ఉండటంతో బరువుకు కాలువ గట్టుపై నిలిచిపోయింది. దీనితో పెద్ద ప్రమాదం తప్పిపోయినది. ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదు.

లైసెన్స్ ఉన్న ఆటో డ్రైవర్లకు వాహన మిత్ర అమలు చేయాలి

ప్రజాశక్తి- తాడేపల్లి



మాట్లాడుతున్న నాయకులు వేముల దుర్గారావు

డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న ప్రతి ఆటో డ్రైవర్ కు వాహన మిత్ర పథకం వర్తింపజేయాలని తాడేపల్లి ఆటో వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు వేముల దుర్గారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మణిపాల్ ఆసుపత్రి ఆటో స్టాండ్ వద్ద సమావేశం ఏర్పాటు చేశారు. దుర్గారావు మాట్లాడుతూ ప్రతి డ్రైవర్‌కు 25 వేల రూపాయలు సంవత్సరానికి ఇవ్వాలని, జీవో నెంబర్ 21ని సవరించి, అన్ని రకాల ఫీజులు పెనాల్టీలు తగ్గించాలని, జైలు శిక్షలు, ఈ చలానాలు రద్దు చేయాలని కోరారు. ఆటో కార్మికులకు, డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఉచిత బస్సు వలన రాష్ట్రంలో 10 లక్షల మందికి పైగా ఆటో డ్రైవర్లకు ఉపాధికి గండి పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్టాండ్ యూనియన్ కార్యదర్శి చిన్నారావు, ఏసుబాబు, శర్మ, రాజు, టి.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం : డాక్టర్ కె.ఆర్.ఎస్.ప్రసాద్



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న కెఎల్ యు విద్యార్థులు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ప్రతి ఒక్కరూ పోషకాహారం తీసుకోవటంతో ఆరోగ్యకరమైన జీవితం గడపవచ్చునని, ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్నపిల్లలు, కిశోర బాలికలు, వఅద్ధులు, అనారోగ్య సమస్యలతో బాధపడేవారు తప్పనిసరి అని, తద్వారా సపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చునని కెఎల్ యూనివర్సిటీ స్టూడెంట్ అఫైర్స్ డీన్ డాక్టర్ కె.ఆర్.ఎస్. ప్రసాద్ సూచించారు. జాతీయ పోషకాహార వారోత్సవాలలో భాగంగా సోమవారం ఎంటిఎంసీ పరిధిలోని మెల్లంపూడి గ్రామంలో యూనివర్సిటీ ఎన్ఎస్-ఎస్ ఆధ్వర్యంలో ఏఐ & డీఎస్ విభాగం ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఇంటింటికి వెళ్లి పోషకాహారం తీసుకోవడం వలన కలిగే లాభాలు గురించి వాటి ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీకాంత్ రెడ్డి, ఆఫీసర్ వి.జోనితిన్ మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ ఫీల్డ్ కోఆర్డినేటర్ పి.సురేష్, వాలంటీర్లను యూనివర్శిటీ వీసీ జి.పార్థసారథివర్మ, ప్రోవీసీలు డాక్టర్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, స్టూడెంట్ అఫైర్స్ సలహాదారులు డాక్టర్ హబీబుల్లాఖాన్, ఏఐ,డీఎస్ విభాగాధిపతి డాక్టర్ విఎస్ వి.ప్రభాకర్ తదితరులు అభినందించారు.

గ్రామ గ్రామానా బీసీ జెండా ఎగరాలి

ప్రజాశక్తి - మంగళగిరి



మన్యం జిల్లా అధ్యక్షునిగా ఎంపికైన రామకృష్ణకు నియామక పత్రం అందజేస్తున్న కేసన శంకరరావు

జిల్లా-నియోజకవర్గాల కమిటీలతో పాటు,మండల కమిటీలు ఏర్పాటు చేసి,గ్రామ గ్రామాన ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం జెండాలు ఎగిరేలా, నిర్మాణ పటిష్టతకు కృషి చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు పిలుపునిచ్చారు. సోమవారం మంగళగిరి రాష్ట్ర కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో మన్యం జిల్లా అధ్యక్షులుగా ఆవాల రామకృష్ణకి కేసన, పలువురు రాష్ట్ర, జిల్లా నాయకులు నియామక పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా కేసన మాట్లాడుతూ,బీసీ 139 కులాల ప్రజలందరి అవసరాలు-ఆకాంక్షలు నెరవేర్చేందుకు, ప్రజలందరి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ప్రతి గ్రామం- వార్డు-డివిజన్ లలో బీసీల జెండా ఎగిరేలా, సంఘం ఏ జెండాను ప్రతి ఒక్క బీసీ గుండెకు చేర్చేలా మన్యం జిల్లా కమిటీ కృషి చేయాలని శంకరరావు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కుమ్మర క్రాంతి కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, యువజన రాష్ట్ర అధ్యక్షులు పారేపల్లి మహేష్, గుంటూరు జిల్లా ఉపాధ్యక్షులు జంజనం వరప్రసాద్, ఎన్టీఆర్ జిల్లా కన్వీనర్ మేకా వెంకటేశ్వరరావు, విజయనగరం జిల్లా ఉపాధ్యక్షులు టి.బుచ్చిబాబు, మన్యం జిల్లా ఉపాధ్యక్షులు అంపిల్లి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.




ర్యాలీ నిర్వహిస్తున్న ఆటో డ్రైవర్లు

ఆటో డ్రైవర్లకు రూ. 30వేలు ఇవ్వాలి

ప్రజాశక్తి - పొన్నూరు

ఆటో డ్రైవర్లకు వాహన మిత్ర 30 వేల రూపాయలు ఇవ్వాలని ఇవ్వాలి ఏఐటీయూసీ పొన్నూరు నియోజకవర్గ అధ్యక్షులు ఆరేటి రామారావు డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఏఐటీయూసీ పొన్నూరు నియోజకవర్గ అధ్యక్షులు ఆరేటి రామారావు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరారు. యూనియన్ కార్యదర్శి కె.రత్నబాబు అధ్యక్షత వహించారు. ఆటో యూనియన్ నాయకులు ఎస్.కె.బాబావాలి మాట్లాడుతూ ఆర్టీసీ బస్సులలో స్త్రీలకు ఉచిత ప్రయాణం అనుమతించిన రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికుల్ని నడిరోడ్డుపై పడేసిందని ఆటో కార్మికుల పొట్ట కొట్టిందని ఆయన ఎద్దేవా చేశారు. బాబురావు మాట్లాడారు. కార్యక్రమంలో కాటూరి విజయకుమార్, సుబ్బయ్య,దేవా, బడేసా, నీల రవి, సుధీర్, ప్రసాద్, అశోక్, ప్రభుదాసు ఆటో యూనియన్ జిల్లా కౌన్సిల్ నెంబర్ వెంకట్రావు గుమ్మడి కిషోర్ బాబు, ఎస్.కె. జానీ, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



పరామర్శిస్తున్న బలసాని కిరణ్

బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-పెదనందిపాడు

అన్నపర్రు గ్రామంలో పిడుగుపాటుతో మృతి చెందిన వ్యవసాయ కూలీలు దేవరపల్లి సామ్రాజ్యం, తన్నీరు నాగమ్మ ల కుటుంబాలకు సోమవారం వైఎస్ఆర్‌సిపి ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి బలసాని కిరణ్ కుమార్, వైసిపి సీనియర్ నాయకులు అన్నపర్రు ఎంపీటీసీ కల్లూరి నాగేశ్వరరావు ఒక్కో కుటుంబానికి 10,000 రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం 10 లక్షల రూపాయలు ఎక్స్ గ్రేషియా అందించాలని కోరారు.



అభినందిస్తున్న డాక్టర్ జగదీష్

శంకరినికి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఉపాధ్యాయ వృత్తి లో విశేష సేవలు అందిస్తున్న కెఎల్ యూనివర్సిటీ, వేల్యూ ఎడ్యుకేషన్ సెల్ ఆచార్యురాలు శంకరికి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. ఈ సందర్భంగా సోమవారం నాడు వర్శిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి.పార్థసారదివర్మ, వైస్ చాన్సులర్లు డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ఎఫ్ఇడి డైరెక్టర్ డాక్టర్ ఎ.జగదీష్, మోనిటరింగ్ కమిటీ స్పెషల్ అధికారిణి డాక్టర్ ఎ.వాణి, ఎఫ్ ఇడి ప్రిన్సిపల్ డాక్టర్ కఅష్ణా రెడ్డి, వాల్యూ ఎడ్యుకేషన్ విభాగాధిపతి డాక్టర్ పవన్ కుమార్ తదితరులు అవార్డు గ్రహీత శంకరిని అభినందించారు. అవార్డు గ్రహీత శంకరి మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో అవార్డు పొందడం చాలా ఆనందంగా ఉందన్నారు.



మాట్లాడుతున్న అధ్యాపకులు ప్రేమ్‌రాజు

అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవం

ప్రజాశక్తి - మంగళగిరి

వి.టి.జే.యం & ఐ.వి.టి.ఆర్ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవం కార్యక్రమం సోమవారం జరిగింది. ఎన్.ఎస్.ఎస్ అధికారి, ఇంగ్లీష్ లెక్చరర్ యర్రగుంట్ల ప్రేమ్ రాజ్ మాట్లాడుతూ ప్రజల్లో ప్రజాస్వామ్య సూత్రాలను ప్రోత్సహించడం, అవగాహన కలిపించాలన్నా ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థినీ విద్యార్థులు ప్రజాస్వామ్య విలువలను తెలుసుకుంటూ ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ చైతన్యవం కావాలన్నారు.

పొలాల్లోని నీటిని బయటికి పంపాలి

ప్రజాశక్తి - కొల్లిపర



రైతులతో మాట్లాడుతున్న శ్రీనిత్య

పొలాల్లోని నీటిని తక్షణమే బయటకు పంపాలని తెనాలి ఉద్యానవన అధికారి శ్రీనిత్య తెలిపారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నీట మునిగిన ఉద్యానవన పంటలను ఆమె సోమవారం పరిశీలించారు. మండలంలోని గుడ్డిబండివారిపాలెం, పోతురాజు డొంక లోని మెట్ట పంటలను పరిశీలించి పంట కాలువలు సరిగా లేకపోవడంతో పొలాల్లో నీరు నిల్వ ఉండిపోయిందని, రైతులు కాలువలను సరి చేసుకొని నీటిని బయటకు పంపి పంటలు నష్టపోకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యానవన సహాయకులు నాగమణి రైతులు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళల ర్యాలీ

ప్రజాశక్తి - కొల్లిపర

మన డబ్బు-మన లెక్క అంటూ డ్వాక్రా మహిళలు సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వెలుగు జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ మహిళల పొదుపు సొమ్ము భద్రత చేకూర్చేందుకు కూటమి ప్రభుత్వం నూతన సాంకేతికను తీసుకొచ్చిందన్నారు. పొదుపు మహిళల ఆర్థిక లావాదేవీలను పారదర్శకంగా ఉంచేందుకు యాప్‌ను ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. జిల్లాలో కొల్లిపర మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భీమవరం పద్మావతి, ఎంపీడీవో విజయలక్ష్మి, ఏపీఎం పద్మావతి, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

పీజీ రెండవ సెమిస్టర్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - ఎఎన్‌యు : ఏఎన్‌యు పరిధిలో జూలైలో జరిగిన పీజీ కోర్సుల రెండవ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను సిఇ ఆలపాటి శివప్రసాదరావు సోమవారం విడుదల చేశారు. ఎంఎస్సీ స్టాటిస్టిక్స్‌లో 45మందికి 44మంది, యంఎస్సీ బయో కెమిస్ట్రీ24 మందికి 17మంది ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. రీవాల్యూయేషన్‌కు ఈనెల 24వ తేదీలోగా ఒక్కో పేపర్‌కు రూ.1860, పర్సనల్ వెరిఫికేషన్‌కు రూ.2190లు చెల్లించి దరఖాస్తులు చేసుకోవాలని సిఇ సూచించారు.

ఫార్మశీ కళాశాలకు ప్రొఫెసర్ల నియామకం

ప్రజాశక్తి - ఎఎన్‌యు : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయఫార్మశీ కళాశాలకు ఇద్దరు ప్రొఫెసర్లను నియమిస్తూ ఇన్చార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం నియామక ఉత్తర్వులు జారీచేశారు. డాక్టర్ జ్యోతిర్మయి దేవినేని, డాక్టర్ కరవడి తేజో మర్తీలను ప్రొఫెసర్‌లుగా నియమించారు. ఈనెల 4వ తేదీన నియామక ఉత్వర్వులు జారీచేయగా 19వ తేదీలోగా విధుల్లో చేరాల్సి ఉండగా, వీరు సోమ వారం విధుల్లో చేరారు. వీరికి నెలకు రు. 1 లక్షా 30 వేలు వేతనంగా నిర్ణయించారు. వీరు ఏడాది పాటు ప్రొఫెసర్లుగా కొనసాగనున్నారు.



ఎగ్జిబిషన్‌లో ప్రాజెక్టుల గురించి వివరిస్తున్న విద్యార్థులు

ఆర్‌విఆర్ జెసిలో ఇంజినీర్స్ డే

ప్రజాశక్తి-గుంటూరు

ఇంజినీరింగ్ రంగం దేశ ఆర్థిక, సాంకేతిక ప్రగతికి వెన్నెముక అని, సర్ మొక్షగుండం విశ్వేశ్వరయ్య కృషి అందరికీ ఆదర్శమని ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ కె. జగదీష్ అన్నారు. ఆర్‌విఆర్‌లో సోమవారం ఇంజినీర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా కళాశాలలో నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో, ఇంజినీరింగ్ విభాగాల విద్యార్థులు ఆటోమేషన్, సైన్స్‌అండ్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ , రోబోటిక్స్, స్వయం ఉపాధి, పర్యావరణ పరిరక్షణ, వ్యర్థాల నిర్వహణ, పునరుత్పాదక ఇంధన వనరులు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఐఓటి, డ్రోన్ల వినియోగం, ట్రాఫిక్ సిస్టం, స్మార్ట్ సిటీ, వంటి వివిధ అంశాలపై 114 రకాల నమూనాలు ప్రదర్శించారు. సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు బహుమతి, సర్టిఫికెట్లు అందచేశారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ రాయపాటి గోపాలకష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె. కష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్లు పాల్గొన్నారు.



మొహిద్దీన్‌ను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్, డైరెక్టర్ అధ్యాపకులు

కిట్స్‌లో ఘనంగా ఇంజినీర్స్‌డే

ప్రజాశక్తి-గుంటూరు

కిట్స్ ఇంజినీరింగ్ కాలేజీలో సోమవారం ఇంజినీర్స్‌డే స్మారక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్ ఎం.విశ్వేశ్వరయ్య చిత్రపటానికి అధ్యాపకులు, విద్యార్థులు పూలమాల వేసి నివాళి అర్పించారు. నీటిపారుదల శాఖ ఎస్‌ఈ ఎం.ఆర్. మొహిదీన్ మాట్లాడుతూ విద్యార్థులు నిజాతీయిగా ఉంటూ, ఇతర జీవితాలను మెరుపరచటం కోసం బాధ్యతాయుతంగా ఉండాలన్నారు. వినూత్నంగా ఆలోచించాలని, వైఫల్యాలకు నిరుత్సాహపడకుండా లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. 20 ఏళ్ల వయసులోనే గంగానదిపై విశ్వేశ్వరయ్య వంతెనను నిర్మించడం ఆయన దార్శనికతకు, ప్రతిభకు నిదర్శమన్నారు. డైరెక్టర్ మాట్లాడుతూ వరదలు వంటి నిరంతర సమస్యలను పరిష్కరించడానికి దార్శనికత కలిగిన ఇంజనీర్ల అవసరం ఎల్లప్పుడూ ఉంటుందని చెప్పారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విశ్వేశ్వరయ్య సిద్ధాంతాలను, ఆలోచనా విధానాన్ని అలవర్చుకోవాలన్నారు. అనంతరం మొహిదీన్‌ను ఘనంగా సత్కరించారు.





